ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కృష్ణా
జిల్లా వార్తలు
శుక్రవారం 23 ఫిబ్రవరి 2024






ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న పీసీసీ అధ్యక్షురాలు షర్మిల, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు (ఇన్‌సెట్‌లో) పోలీసుల బలవంతపు అరెస్టులు

బెజవాడలో టెన్షన్.. టెన్షన్!

- సచివాలయం వైపు కాంగ్రెస్ అడుగులు
- దారిన వెళ్లేవారికి అడుగడుగునా తనిఖీలు..
- పోలీసుల కళ్లుగప్పి ఆంధ్రరత్న భవన్‌కు చేరిన పార్టీ కార్యకర్తలు

ఆ వీధిలోకి వెళ్లాలంటే గుర్తింపు కార్డు చూపించాలి. పది తర్వాత వ్యాపారులు షెట్టర్ తీయాలి. హోటల్‌లో జరిగే శుభకార్యానికి వచ్చే వారిని తీసుకెళ్లాలంటే నిర్వాకులు వీధి చివరన ఉండాలి. ఇదీ ఆంధ్రరత్న భవన్ వద్ద గురువారం నాటి పరిస్థితి. మినీ డీఎస్సీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ చలో సచివాలయానికి ఇచ్చిన పిలుపు గురువారం ఉద్రిక్తతకు దారితీసింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

విజయవాడ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రరత్న భవన్ ఉన్న వీధిని పోలీసులు బుధవారం రాత్రి నుంచే తమ ఆధీనంలోకి తీసుకున్నారు. అటు ఏలూరు రోడ్డు వైపు, ఇటు కాశేశ్వరరావు రోడ్డు వైపు మార్గాన్ని పూర్తిగా మూసివేశారు. రెండు వైపులా మూడంచెల భద్రత ఏర్పాటు చేశారు. ఆంధ్రరత్న భవన్ ఉన్న వీధిలో వ్యాపార సముదాయాలు, బ్యాంకులు, హోటళ్లు ఉన్నాయి. వాటిలోకి వెళ్లే వారిని గుర్తింపు కార్డులు పరిశీలించిన తర్వాతే అనుమతించారు. ఈ వీధిలో ఉన్న హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లోకి వెళ్లే ఉద్యోగులను గుర్తింపు కార్డులు పరిశీలించాక వదిలారు. ఆంధ్రరత్న భవన్‌కు చెంతనే ఒక హోటల్‌లో ఉంది. ఇందులో వివాహ వేడుకకు హాజరయ్యే వారిని వీధిలో చివరన ఆపేశారు. వేడుక నిర్వాహకులకు సంబంధించిన వారు వచ్చిన తర్వాతే వారిని హోటల్‌లోకి పంపారు. కాంగ్రెస్ కార్యకర్తలు రకరకాల కారణాలు చెప్పి ఆంధ్రరత్న భవన్‌లోకి వెళ్తారని పోలీసులు ఈ విధంగా వ్యవహరించారు. అయినప్పటికీ పోలీసుల కన్నుగప్పి కార్యకర్తలు వివిధ మార్గాల్లో భవన్‌లోకి అడుగుపెట్టారు. వైఎస్ షర్మిల తన చాంబర్ నుంచి బయటకు వచ్చి ధర్నాలో కూర్చోగానే వారూ ధర్నాలో పాల్గొన్నారు. 'మాట తప్పాడు... మడమ తిప్పాడు, నిరుద్యోగులను నిండా ముంచాడు, మెగా అంటే రాజన్న... దగా అంటే జగనన్న, దగా డీఎస్సీ వద్దు... మెగా డీఎస్సీ ముద్దు' అని నినాదాలు చేశారు. ఈ నిరసనలో కాంగ్రెస్ నేతలు సుంకర పద్మశ్రీ, నరహరశెట్టి నరసింహరావు, కొలనుకొండ శివాజీ, బొర్రా కిరణ్ పాల్గొన్నారు.




పోలీసుల తీరిలా..

అనుమతిపై అనుమానాలు

జగన్ సీఎం అయిన తర్వాత నుంచి రాష్ట్రంలో ఎలాంటి నిరసనలకు, ర్యాలీలకు అనుమతి ఇవ్వలేదు. విజయవాడలో ప్రతిపక్షాలు, ఉద్యోగులు, కాంట్రాక్ట్ ఉద్యోగులు చేసిన చలో కార్యక్రమాలను పోలీసులు అడ్డుకున్నారు. ఆయా సంఘాల నేతలు గడప దాటకుండా బ్రేక్‌లు వేశారు. ముందస్తుగా అదుపులోకి తీసుకున్న సందర్భాలు అనేకం ఉన్నాయి. మెగా డీఎస్సీని ప్రకటించాలని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల చేపట్టిన చలో సచివాలయం పిలుపులో మాత్రం పోలీసుల తీరు భిన్నంగా కనిపించింది. ఇప్పటి వరకు జరిగిన పోరాటాలను, నిరసన కార్యక్రమాలను ఉక్కుపాదంతో తొక్కేసిన పోలీసులు షర్మిల చేపట్టిన పాదయాత్రకు మాత్రం మార్గం ఇచ్చారు. పోలీసులు ఏర్పాటు చేసిన బందోబస్తును చూసి ఆమె కాంగ్రెస్ కార్యాలయం నుంచి బయటకు వస్తే అరెస్టు చేస్తారని అంతా భావించారు. ఈ అరెస్టు నుంచి తప్పించుకోవడానికి షర్మిల కాంగ్రెస్ కార్యాలయ ఆవరణలోనే ధర్నా చేశారు. తర్వాత ఆమె ర్యాలీ చేసుకుంటూ బయలుదేరారు. దీనికి పోలీసులు ఎలాంటి అభ్యంతరం వ్యక్తం చేయలేదు. పోలీసులు అరెస్టు చేయరని సమాచారం ఉండడంతో షర్మిల ఏలూరు రోడ్డు నుంచి పోలీసు కంట్రోల్ రూం వరకు ర్యాలీ చేశారు. చల్లపల్లి బంగ్లా, పోలీసు కంట్రోల్ రూం వద్ద బైఠాయించారు.

దుర్గగుడిలో అక్రమాలపై సీఎంవో ఆరా

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]



వన్‌టౌన్, ఫిబ్రవరి 22 : ఇంద్రకీలాద్రిపై దుర్గగుడిలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై ముఖ్యమంత్రి కార్యాలయంలో పలువురు ఉన్నతాధికారులు ఆరా తీస్తున్నట్టు సమాచారం. దేవస్థానంలో పలువురు అధికారులు, పాలకమండలిలో కీలకంగా ఉన్న వ్యక్తి అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారని ఇటీవల ఆంధ్రజ్యోతిలో పలు కథనాలు ప్రచురితమయ్యాయి. గురువారం 'దుర్గమ్మ సన్నిధిలో దోపిడీ, బియ్యాన్ని భోంచేశారు!' కథనాలు ప్రచురం కావడంతో ముఖ్యమంత్రి కార్యాలయంలోని ఉన్నతాధికారులు స్పందించారు. అసలు దుర్గగుడిలో ఏం జరుగుతోందన్న విషయాలపై ఆరా తీస్తున్నట్టు తెలిసింది. ఎన్నికల నేపథ్యంలో దేవస్థానంలో జరుగుతున్న అవినీతి, అక్రమాల ప్రచారం వైసీపీకి వ్యతిరేకంగా మారుతుందనే ఆలోచనలో ఉన్నట్టు తెలిసింది. దేవస్థానం బోర్డులోని కీలకవ్యక్తిని కూడా సీఎంవో నుంచి ఓ ఉన్నతాధికారి దేవస్థానంలో జరుగుతున్న తంతుపై వివరాలు అడిగి తెలుసుకుని ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనాలపై ఆగ్రహం వ్యక్తం చేసినట్టు సమాచారం.

నేటి నుంచి తిరుపతమ్మ పెద్ద తిరునాళ్ల

- రాత్రి కల్యాణోత్సవం
- భారీగా తరలిరానున్న భక్తులు
- ఇరుముడి సమర్పణకు వస్తున్న దీక్షా స్వాములు
- మునేటిలో నీరు లేకపోవటంతో జల్లు స్నానాలకు ఏర్పాట్లు

- 6లో..

ఏసీబీకి చిక్కిన శానిటరీ ఇన్‌స్పెక్టర్

- 6లో..

పట్టాలు తప్పిన గూడ్స్ రైలు



మధ్యతరగతి వర్గాలను ఆకట్టుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన భారత్ రైస్, భారత్ దాల్ అక్రమార్కులకు వరంగా మారాయి. ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో ఇప్పటి వరకు ఈ పథకం అమలు కాకపోయినా ఉత్తర భారతదేశం నుంచి వైజాగ్‌కు అక్కడి నుంచి విజయవాడకు అక్రమార్కులు దిగుమతి చేస్తున్నారు. భారత్ దాల్‌ను గోడౌన్‌లో రీ ప్యాకింగ్ చేసి ఒక్కొక బ్యాగ్‌కు రూ.25 అదనంగా కలిపి లేబుల్ అంటిస్తున్నారు. సివిల్ సప్లయిస్ అధికారులు వీటిని పట్టుకోవడంతో అక్రమం వెలుగులోకి వచ్చింది.

మాఫియా గుప్పెట్లో.. భారత్ రైస్

బెజవాడలో ట్రేడర్లు, హోల్‌సేల్ వ్యాపారుల చేతుల్లోకి ఉత్పత్తులు

- భారత్ దాల్ కూడా రీ సైక్లింగ్
- ఉత్తర భారత దేశం నుంచి దిగుమతి
- బెజవాడ కేంద్రంగా రీ ప్యాకింగ్
- రూ.60 భారత్ దాల్ బ్యాగ్‌కు రూ.85 లేబుల్
- పోర్టులకు చేరి అటు నుంచి ఇండోనేషియా, బంగ్లాదేశ్‌లకు రవాణా





(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : భారత్ రైస్ త్వరలో ప్రారంభం అవుతుందని ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రేషన్ దుకాణాల్లో పెద్దఎత్తున ప్రచారం చేశారు. ఎంపిక చేసిన రేషన్ దుకాణాల్లో సెల్ఫీ పాయింట్లను కూడా ఏర్పాటు చేశారు. కిలో బియ్యం రూ.29కే అంటే బస్తా రూ.725కే భారత్ రైస్ బ్యాగ్ వస్తుందని కార్డుదారులు భావించారు. దక్షిణ భారతదేశానికి అతి స్వల్పంగానే ఈ బియ్యం కేటాయించారు. కేంద్ర ప్రభుత్వ సహకార కేంద్రాల్లోనూ, ఈ కామర్స్ సైట్లలోనూ భారత్ రైస్ అందుబాటులో ఉంటాయని కూడా ప్రభుత్వం ప్రకటించింది. ఇప్పటి వరకు ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. భారత్ రైస్‌ను మార్కెట్‌లోకి విడుదల చేసిన తర్వాత భారత్ దాల్‌ను కూడా విడుదల చేశారు. ఈ రెండూ ఉమ్మడి కృష్ణాజిల్లాలో కనీసం ఒక్క కేంద్ర ప్రభుత్వ సహకార కేంద్రం దగ్గరకు కూడా చేరలేదు.

అక్రమార్కుల చేతుల్లోకి భారత్ రైస్

జిల్లాలో పథకం ప్రారంభం కాకపోయినా బెజవాడలోని అక్రమార్కుల చేతుల్లోకి భారత్ రైస్ వచ్చేశాయి. బడా ట్రేడర్లు ఉత్తర భారతదేశం నుంచి భారత్ రైస్, భారత్ దాల్‌ను దిగుమతి చేసుకున్నారు. రైళ్ల ద్వారా ముందుగా వైజాగ్‌కు దిగుమతి చేసి అక్కడి నుంచి విజయవాడకు తీసుకొచ్చారు. వాటిని లూజుగా రీ ప్యాకింగ్ చేసి బయటి మార్కెట్‌కు తరలిస్తారు. ఇలా అక్రమ వ్యాపారం చేసేవారికి గొల్లపూడి హోల్‌సేల్ మార్కెట్‌లో దుకాణాలు ఉన్నాయి. వీరు నగరంలో కొన్ని ప్రాంతాల్లో గోడౌన్లు నిర్వహిస్తుంటారు. ఈ గోడౌన్లకు భారత్ రైస్, భారత్ దాల్‌ను పెద్దఎత్తున దిగుమతి చేసుకున్నారు. ఇది విజిలెన్స్ లీగల్ మెట్రాలజీ అధికారులకు తెలిసింది.

రీ ప్యాకింగ్ బ్యాగులు ఎగుమతి

భారత్ రైస్ బ్యాగులు కూడా ఉత్తరాది నుంచి రైళ్లలో దిగుమతి జరిగాయన్న విమర్శలు వస్తున్నాయి. రైళ్ల ద్వారా నేరుగా పోర్టులకు చేరి అక్కడి నుంచి ఇండోనేషియా, బంగ్లాదేశ్‌లకు రవాణా జరుగుతున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి.

అధికారులకు చిక్కిన భారత్ దాల్

భారత్ దాల్ బ్యాగ్‌లను కొద్దిరోజుల కిందట సివిల్ సప్లయిస్ అధికారులు పట్టుకున్నారు. గొల్లపూడి హోల్‌సేల్ మార్కెట్‌లో దుకాణాలు కలిగిన 'కాసుల' బ్రదర్స్ భవానీపురంలోని శైలజ దాల్ మిల్‌లో నిల్వ చేసి రీ ప్యాకింగ్ చేయడాన్ని గుర్తించి సివిల్ సప్లయిస్ అధికారులు పట్టుకున్నారు.

రీ ప్యాకింగ్‌లో భారీ ధరతో లేబుల్

భారత్ దాల్ కేజీ రూ.58 కాగా రూ.2 మార్జిన్ వేసుకున్నా రూ.60కు విక్రయించాల్సి ఉంటుంది. కానీ ఇక్కడ రీ ప్యాకింగ్ చేసి రూ.85 లేబుల్స్ వేయటాన్ని సివిల్ సప్లయిస్ అధికారులు గుర్తించారు.



రుద్రవరం వద్ద టిడ్కో గృహాల పరిస్థితి

ఇల్లెప్పుడవుతుంది బాబోయ్!

అసంపూర్తిగానే టిడ్కో ఇళ్ల నిర్మాణం

జిల్లాలో లబ్ధిదారులకు కేటాయించిన టిడ్కో గృహాలు ఇప్పట్లో అందే సూచనలు కానరావడం లేదు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఈ గృహసముదాయాల నిర్మాణాలను రివర్స్ టెండరింగ్ పేరుతో నిలిపేశారు. అప్పటి నుంచి వీటి నిర్మాణం నత్తనడకన సాగుతోంది. మచిలీపట్నం నియోజకవర్గంలోని గోసంఘం వద్ద గృహసముదాయాల పనులు దాదాపు పూర్తి చేసినా గృహాలను లబ్ధిదారులకు అప్పగించకుండా ప్రభుత్వం జాప్యం చేస్తోంది. పెనమలూరు నియోజకవర్గం, ఉయ్యూరులో టిడ్కో గృహసముదాయాల నిర్మాణం ఎప్పటికి పూర్తవుతుందో అంతుపట్టడం లేదు. మచిలీపట్నం నియోజకవర్గం, రుద్రవరంలోని టిడ్కో గృహాల నిర్మాణ పనులు నత్తనడకనే సాగుతున్నాయి. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అయినా ఇళ్లను అందిస్తారనే ఆశతో లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు.

- వైసీపీ అధికారంలోకొచ్చాక నత్తనడకన నిర్మాణం
- మచిలీపట్నం గోసంఘంలో ఇళ్ల నిర్మాణం పూర్తయినా.. లబ్ధిదారులకు ఇవ్వని ప్రభుత్వం
- రుద్రవరంలోని గృహ సముదాయాల వద్ద పనులు అంతంత మాత్రమే..
- ఉయ్యూరులోనూ నెమ్మదిగా టిడ్కో ఇళ్ల నిర్మాణం

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : ఆంధ్రప్రదేశ్ టౌన్‌షిప్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టిడ్కో) ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద 2017లో అప్పటి టీడీపీ ప్రభుత్వం జిల్లాలో 13,712 గృహాల నిర్మాణాలను ప్రారంభించింది. 65 శాతం మేర గృహ సముదాయ నిర్మాణాలు టీడీపీ ప్రభుత్వ హయాంలోనే పూర్తిచేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక జియోట్యాగింగ్, టెండర్లు అధిక ధరకు పిలిచారని, లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు జరిగాయనే కారణాలు చూపి ఈ గృహసముదాయాల పనులను నిలిపివేశారు. మూడేళ్ల క్రితం ఈ పనులను ప్రారంభించారు. గుడివాడ నియోజకవర్గం మల్లాయపాలెంలో నిర్మించిన 8,912 గృహాలను గతేడాది జూన్‌లో సీఎం వైఎస్ జగన్ ప్రారంభించారు.

గోసంఘం వద్ద పరిస్థితి ఇదీ

మచిలీపట్నం నియోజకవర్గం గోసంఘంలోని 864 గృహాల నిర్మాణ పనులు దాదాపు పూర్తి చేశారు. ఏడాదిన్నరగా ఈ గృహ సముదాయాలకు తాళాలు వేసి ఉంచారు. ఇక్కడి గృహాలకు రంగులు వేయడంలో చూపిన శ్రద్ధ మౌలికవసతులు కల్పనలో చూపలేదు. ఇటీవల ఇక్కడ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ప్రారంభించారు. మంచిరోజున ఈ గృహాలు లబ్ధిదారులకు అందిస్తామని చెబుతూ కాలయాపన చేస్తున్నారు. కొద్దిరోజుల్లో ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తే ఈ గృహసముదాయాలను లబ్ధిదారులకు అందించడం మరింత ఆలస్యం కావడం ఖాయంగా కనిపిస్తోంది. ప్రతిపక్ష, వామపక్ష నాయకులు ఈ గృహాలను పేదలకు అప్పగించాలని పలుమార్లు ఆందోళనలు చేశారు. గృహాల నిర్మాణం పూర్తయినా ఏ కారణంచేతనో వాటిని లబ్ధిదారులకు అందించడానికి పాలకులు, అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఈ గృహసముదాయం వద్ద మురుగునీటిని బయటకు పంపేందుకు డ్రెయినేజీ పనులు అసంపూర్తిగానే చేశారు.

రుద్రవరంలో పనులు ఎప్పటికి పూర్తవుతాయో..

మచిలీపట్నం నియోజకవర్గంలోని రుద్రవరంలో ముందుగా 3 వేలకుపైగా టిడ్కో ఇళ్ల నిర్మాణం కోసం పునాదులు వేశారు. వివిధ కారణాలతో ఈ సంఖ్యను 1440కు కుదించారు. టీడీపీ హయాంలోనే ఇక్కడ 60 శాతం మేర పనులు పూర్తి చేశారు. మిగిలిన పనులను మూడేళ్ల క్రితం ప్రారంభించి చేస్తూనే ఉన్నారు. ఇక్కడి గృహాలకు సంబంధించి గదులకు కిటికీలు, డోర్‌లు, విద్యుదీకరణ పనులు ఇంకా జరుగుతూనే ఉన్నాయి. తాగునీటి అవసరాల నిమిత్తం నగరంలోని పంపుల చెరువు నుంచి పైప్‌లైన్ వేశారు. ఓవర్‌హెడ్ ట్యాంకు, సంప్‌ల నిర్మాణం పనులు కొనసాగుతున్నాయి. ఎప్పటికప్పుడు నెలరోజుల్లోగా పనులు పూర్తి చేస్తామని చెప్పడమే తప్ప పనులు వేగవంతం చేసిన దాఖలాలు లేనేలేవు. ఇక్కడ రహదారులు నిర్మాణం చేసినా డ్రెయినేజీల నిర్మాణం అస్తవ్యస్తంగానే ఉంది. ఇక్కడ పనులు పూర్తి చేయడానికి మరో ఏడాది సమయం పట్టే అవకాశం ఉంది. ఇటీవల ఈ గృహసముదాయాల వద్ద అధికారులతో ఎమ్మెల్యే పేర్ని నాని సమీక్షా సమావేశం నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న పనులకు సంబంధించిన జాబితాను తయారు చేయించారు. త్వరితగతిన పనులు పూర్తిచేయాలని చెప్పి సరిపెట్టారు. లబ్ధిదారులకు మాత్రం ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేలోగా గృహాలు అప్పగిస్తామని చెప్పడం గమనార్హం.

ఉయ్యూరులో ఎక్కడి పనులు అక్కడే..!

పెనమలూరు నియోజకవర్గం, ఉయ్యూరుటౌన్ పరిధిలోని జెమిని స్కూల్, ఎగినపాడు రహదారి వెంబడి, గండిగుంట పంచాయతీ మూడు ప్రాంతాల్లో 2,946 టిడ్కో గృహాల నిర్మాణం చేయాల్సి ఉంది. ఈ పనులు చేయలేనని కాంట్రాక్టర్ చేతులెత్తేసి కొంతకాలంపాటు పనులు నిలిపివేశారు. ఇటీవల ఈ పనులు తిరిగి ప్రారంభించినా వేగవంతంగా పనులు జరగడంలేదు. పెనమలూరు నియోజకవర్గం వైసీపీ ఇన్‌చార్జిగా మంత్రి జోగి రమేష్ నియోజకవర్గంలో పర్యటిస్తూ టిడ్కో గృహాలను లబ్ధిదారులకు ఇచ్చేస్తామని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో పెనమలూరు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ఈ గృహసముదాయాల వద్ద కనీస వసతులు కల్పించకుండా, గృహనిర్మాణాల పనులు పూర్తిస్థాయిలో చేయకుండా లబ్ధిదారులకు వీటిని అప్పగిస్తామని చెబుతున్నారంటూ వారం రోజులక్రితం లబ్ధిదారులతో కలిసి ఆందోళన చేశారు.



రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న రైతు సంఘం, కౌలు రైతు సంఘం నాయకులు

ధాన్యం డబ్బులు ఇవ్వకపోవడం సిగ్గుచేటు

- ఏపీ కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు
- పౌరసరఫరాల శాఖ రాష్ట్ర కార్యాలయం వద్ద ధర్నా

పెనమలూరు, ఫిబ్రవరి 22 : ధాన్యాన్ని ప్రభుత్వానికి అమ్మి 40 రోజులు కావస్తున్నా నగదు ఇంత వరకు రైతుల ఖాతాల్లో జమ చేయకపోవడం ప్రభుత్వానికి సిగ్గుచేటని ఏపీ కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు పేర్కొన్నారు. రైతులకు ధాన్యం డబ్బులు విడుదల చేయాలని కోరుతూ ఏపీ కౌలు రైతు సంఘం, రైతు సంఘం ఆధ్వర్యంలో విజయవాడ పౌరసరఫరాల శాఖ రాష్ట్ర కార్యాలయం వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. హరిబాబు మాట్లాడుతూ ప్రజలకు వివిధ పథకాలకు బటన్ నొక్కుతున్న ముఖ్యమంత్రికి ధాన్యం అమ్మిన రైతుల సొమ్ము బకాయిలను విడుదల చేయడానికి చెయ్యి రావడంలేదని విమర్శించారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు మాట్లాడుతూ డిసెంబరులో వచ్చిన తుపాను వల్ల ధాన్యాన్ని ఆఫ్‌లైన్లో తోలారని, దాన్ని ఇంతవరకు ఆన్‌లైన్ చేయకపోవడం వల్ల డబ్బులు రావడం లేదని అన్నారు. వెంటనే ఆన్‌లైన్ చేసి రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయాలని డిమాండ్ చేశారు. కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంచకర్ల రంగారావు మాట్లాడుతూ కౌలు రైతులకు గుర్తింపు కార్డులు లేకపోవడం వల్ల బ్యాంకులు రుణాలు ఇవ్వడం లేదన్నారు. ధర్నా అనంతరం రాష్ట్ర పౌరసరఫరాల శాఖ డీఎం వీరపాండ్యన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ధర్నాలో కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కె.శివనాగేంద్రం, కోశాధికారి టీవీ లక్ష్మణస్వామి, ఉపాధ్యక్షుడు శీలం నారాయణరావు, ఏసుదాసు, సుబ్బారావు, వి.శంకరరావు, ఎం.ఆంజనేయులు, ఉప్పాడ, త్రిమూర్తులు పాల్గొన్నారు.



వీరమ్మ తిరునాళ్లలో ఆలయం వద్ద భక్తులు

వీరమ్మ తిరునాళ్లకు భక్తుల తాకిడి



ఉయ్యూరు, ఫిబ్రవరి 22 : వీరమ్మ తిరునాళ్లకు భక్తుల తాకిడి పెరిగింది. తిరునాళ్లలో నాల్గవ రోజైన గురువారం అమ్మవారిని దర్శించి మొక్కుబడి తీర్చుకునేందుకు భక్తులు తరలివచ్చారు. మహిళలు ఆలయ ప్రాంగణంలో పాల పొంగళ్లు తయారు చేసి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. డప్పువాయిద్యాల నడుము సందడిగా మొక్కు తీర్చుకునేందుకు చీర, సారె, పసుపు కుంకుమ సమర్పించారు. అనంతరం అమ్మవారిని దర్శించుకున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఆలయం వద్ద భక్తుల సందడి కన్పించింది.



పూర్ణాహుతిలో చైర్మన్ జంగాల శ్రీనివాసరావు

నేటినుంచి తిరుపతమ్మ పెద్ద తిరునాళ్ల

» పెద్ద ఎత్తున తరలిరానున్న భక్తులు

పెనుగంచిప్రోలు, ఫిబ్రవరి 22 : తిరుపతమ్మ పెద తిరునాళ్లు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. శుక్రవారం రాత్రి కల్యాణం, 24న జలబిందెల మహోత్సవం, 25 పాల పొంగళ్లు, అంక సేవ, 26న దీవెన బండారు, 27న పూర్ణాహుతితో తిరునాళ్లు ముగుస్తాయని ఇవో కె.రమేష్‌నాయుడు చెప్పారు. అమ్మవారి కల్యాణోత్సవ వేదికను భారీగా రూపొందిస్తున్నారు. మునేటిలో నీరు లేకపోవటంతో జల్లు స్నానాలకు ఏర్పాట్లు చేశారు. దీక్షా స్వాముల ఇరుముడి సమర్పణకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. జగ్గయ్యపేట సీఐ ఆధ్వర్యంలో పెనుగంచిప్రోలు ఎస్సై రాంబాబు సిబ్బందితో ప్రత్యేక బందోబస్తు ఏర్పాట్లు చేశారు. గురువారం గణపతి హోమం, వాస్తుపూజ, గోపూజ, పూర్ణాహుతి నిర్వహించారు. అమ్మవారి దీక్షా స్వాముల తిరుముడి సమర్పణకు శివాలయంలో ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు తీసుకున్నామని చైర్మన్ జంగాల శ్రీనివాసరావు చెప్పారు. ఆర్యవైశ్య సంఘం, వాసవీ క్లబ్, వని తా క్లబ్‌లు సంయుక్త ఆధ్వర్యంలో తిరుముడి సమర్పణకు వచ్చే దీక్షా స్వాములకు అల్పాహారం పంపిణీ చేశారు.



ఆసుపత్రి నిర్వాహకులకు చెక్కు అందజేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

రోటరీ క్లబ్ సహకారంతో ఆంధ్రా ఆసుపత్రిలో చిన్నారులకు ఉచిత గుండె ఆపరేషన్లు

ప్రభుత్వాసుపత్రి, ఫిబ్రవరి 22 : రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ సహకారంతో నిరుపేద కుటుంబాలకు చెందిన 76 మంది చిన్నారులకు ఆంధ్రహాస్పిటల్స్ వైద్యులు గుండె శస్త్రచికిత్సలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి ఆవరణలో గురువారం విలేకర్ల సమావేశంలో శస్త్ర చికిత్సల నిమిత్తం రూ.65,22,873 చెక్కును ఆసుపత్రి యాజమాన్యానికి అందజేశారు. ఈ సందర్భంగా ఆంధ్రా ఆసుపత్రి ఎండీ, పీడియాట్రిక్ చీఫ్ పీవీ రామారావు మాట్లాడుతూ, గత ఎనిమిదేళ్లుగా తమ ఆసుపత్రిలో సుమారు 4000 మంది చిన్నారులకు గుండె సర్జరీలు, ఇంటర్వెన్షన్స్ చేసినట్టు చెప్పారు. అతి క్లిష్టమైన ఆపరేషన్లు విజయవంతమయ్యాయన్నారు. పిల్లల కార్డియాక్ టీమ్, ఇన్టెన్సివ్ కేర్ సిబ్బందిని అభినందించారు. రోటరీ జిల్లా గవర్నర్ రావూరి సుబ్బారావు(దత్తా) మాట్లాడుతూ, రోటరీ సంస్థ వైద్యసేవలకు నిధులు సమకూర్చడంలో ముందుంటుందన్నారు. ఈ సందర్భంగా ఆంధ్ర హాస్పిటల్ యాజమాన్యాన్ని అభినందించారు. ప్రాజెక్ట్ చైర్మన్ డాక్టర్ జీవీ మోహన్ ప్రసాద్ మాట్లాడుతూ, పేద వారికి వైద్యం రోటరీ అంతర్జాతీయ ప్రమాణాలలో ఒకటన్నారు. ప్రాజెక్ట్ కార్యరూపం దాల్చడంలో ప్రధాన పాత్ర పోషించిన రోటరీ విజయవాడ సభ్యుడు కరిణి చంటిరాజు ఈ మధ్య కాలంలో మృతి చెందారని, రోటరీ ద్వారా సమాజానికి చంటి రాజు చేసిన సేవలను సభ్యులు కొనియాడారు. ప్రాజెక్ట్‌కు కరిణి హోలి (కరిణి చంటిరాజు కుమారుడు) ప్రైమరీ కాంట్రాక్ట్ పర్సన్‌గా, జి.భానుప్రకాశ్ సెంకడరీ కాంట్రాక్ట్ పర్సన్‌గా వ్యవహరిస్తున్నారని తెలియజేశారు. ఈ సమావేశంలో ఆసుపత్రి డాక్టర్లు, రోటరీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.



ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న కొనకళ్ల, మండలి

బాబుతోనే అభివృద్ధి, ప్రజాస్వామ్య పరిరక్షణ

» కొనకళ్ల నారాయణ

చల్లపల్లి, ఫిబ్రవరి 22 : చంద్రబాబుతోనే అభివృద్ధి, ప్రజాస్వామ్య పరిరక్షణ సాధ్యమని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణ అన్నారు. చల్లపల్లిలో పార్టీ కార్యాలయాన్ని మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్‌తో కలిసి గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో కొనకళ్ల మాట్లాడుతూ, టీడీపీ, జనసేన కూటమి రాష్ట్రంలో అధికారంలోకి రావాల్సిన ఆవశ్యకతను తెలియజేశారు. చంద్రబాబు ఐదేళ్ల పాలనలో నవ్యాంధ్రను అభివృద్ధిబాట పట్టించారని తెలిపారు. చంద్రబాబు హయాంలో పనులు ప్రారంభిస్తే, జగన్ ప్రభుత్వం కమీషన్లకు కక్కుర్తి పడి నాసిరకంగా బందరు పోర్టును నిర్మిస్తున్నారని విమర్శించారు. అవనిగడ్డలో అభ్యర్థిగా బుద్ధప్రసాద్‌ను గెలిపించుకోవాలన్నారు. ఎన్నికల్లో కార్యకర్తలే కీలకపాత్ర అనీ, కార్యకర్తలు లేనిదే పార్టీ లేదన్నారు. మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ, ఉత్సాహంగా పనిచేసే కార్యకర్తలు అవనిగడ్డలో టీడీపీ జెండాను రెపరెపలాడించాలన్నారు. నా ఎస్సీలు, నా బీసీలు అంటూ వైసీపీ శ్రేణులు వారిపై దాడులకు పాల్పడుతుంటే ముఖ్యమంత్రి పెత్తందారుల పక్షాన నిలుస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో జరుగుతున్న అరాచక విధానాలు, అవినీతి.. దోపిడీలపై ప్రజల్ని చైతన్యం చేయటం ప్రధాన కర్తవ్యంగా కార్యకర్తలు పనిచేయాలని సూచించారు. చల్లపల్లి మండల అధ్యక్షుడు మోర్ల రాంబాబు అధ్యక్షతన జరిగిన సభలో జిల్లా ఉపాధ్యక్షుడు మండలి వెంకట్రామ్, తెలుగుమహిళా జిల్లా అధ్యక్షురాలు తలశిల స్వర్ణలత, జనసేన జిల్లా సంయుక్త కార్యదర్శి ఉస్మాన్ షరీఫ్ తదితరులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

» పదో తరగతి, ఇంటర్, డీఎస్సీ పరీక్షలు సక్రమంగా నిర్వహించాలి

» కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల కలెక్టర్లు



పరీక్షల నిర్వహణపై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు

మచిలీపట్నం/విజయవాడ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : త్వరలో జరగనున్న పదో తరగతి, ఇంటర్మీడియట్, డీఎస్సీ పరీక్షలను సక్రమంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని కృష్ణాజిల్లా కలెక్టర్ పి.రాజాబాబు, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు అధికారులను ఆదేశించారు. విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ప్రధానకార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్, కమిషనర్ ఎస్.సురేశ్‌కుమార్, ఇంటర్ విద్యా కమిషనర్ సౌరభ్ గౌర్ తదితరులతో కలిసి పరీక్షల నిర్వహణపై జిల్లాల కలెక్టర్లతో గురువారం వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల కలెక్టర్లు అధికారులతో మాట్లాడుతూ, పదోతరగతి ప్రశ్నాపత్రాల్లో క్యూఆర్ కోడ్ నిక్షిప్తమై ఉంటుందన్నారు. ఎవరైనా ప్రశ్నాపత్రాన్ని లీక్‌చేస్తే ఏ విద్యార్థినుంచి ఈ ప్రశ్నాపత్రం లీక్ అయ్యిందో వెంటనే తెలిసిపోతుందన్నారు. ఈ విషయాన్ని విద్యార్థులకు ముందస్తుగానే తెలియజేయాలన్నారు. పది పరీక్షలకు కృష్ణాజిల్లానుంచి 26507మంది, 33007 మంది విద్యార్థులు హాజరవుతున్నారన్నారు. మార్చి 2 నుంచి ఇంటర్ పరీక్షలు, మార్చి 18 నుంచి పదోతరగతి పరీక్షలు, మార్చి 15న డీఎస్సీ పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేయాలన్నారు. పరీక్షాకేంద్రాలకు విద్యార్థులు సకాలంలో చేరుకునేలా ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలను ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షాకేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేయాలని, ప్రశ్నాపత్రాలు తరలించే సమయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జవాబు పత్రాలను భద్రం చేసేందుకు పోస్టల్ అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. సమావేశంలో కృష్ణాజిల్లా జేసీ గీతాంజలి శర్మ, ఏఎస్పీ జి.వెంకటేశ్వరరావు, డీఈవో తాహెరా సుల్తానా, జిల్లాపరీక్షల నియంత్రాణాధికారి డేవిడ్ రాజు, రవాణాశాఖ అధికారి వాణిశ్రీ, ఆర్ఐవో రవికుమార్, పోస్టల్‌శాఖ సూపరింటెండెంట్ సుధాకర్, డీఎంఅండ్‌హెచ్‌వో గీతాబాయి, విద్యాశాఖ అధికారులు, ఎన్టీఆర్ జిల్లా నుంచి ఇంటర్మీడియట్ విద్యాధికారి సీఎస్ఎస్ఎన్ రెడ్డి, డీఎస్ఈవో యూవీ సుబ్బారావు, ఏడీ కేఎస్వీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



పరీక్షల నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్‌లో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

బ్రాడ్‌బ్యాండ్ సేవలను వారంలోగా ఏర్పాటు చేయండి : రాజాబాబు

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సెల్‌టవర్ సిగ్నల్స్, బ్రాడ్‌బ్యాండ్ సేవలను పూర్తిస్థాయిలో జిల్లావ్యాప్తంగా అందుబాటులోకి తీసుకురావాలని కలెక్టర్ రాజాబాబు సర్వీస్ ప్రొవైడర్లను ఆదేశించారు. బీఎస్ఎన్ఎల్, జియో ఫైబర్‌నెట్ వోడాఫోన్, ఎయిర్‌టెల్, ఆక్ట్ సర్వీస్ ప్రొవైడర్లతో గురువారం తన చాంబరులో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఎన్నికల సమయంలో సమాచారం ఇచ్చిపుచ్చుకునేందుకు ఇంటర్‌నెట్ సేవలు అత్యంత అవసరమన్నారు. పోలింగ్ కేంద్రాలవారీగా ఇంటర్‌నెట్ సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించేందుకు త్వరలో కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేస్తున్నామని, అందుకు అవసరమైన బీఎస్ఎన్ఎల్ కనెక్షన్లు ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికల్లో అభ్యర్థులు ప్రచార ప్రకటనలు, ఎస్ఎంఎస్‌లు ఓటర్లకు పంపేందుకు ముందస్తు అనుమతులు తీసుకోవాలన్నారు.

జాబు కావాలంటే బాబు రావాలి

» నిరుద్యోగరహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళిక

» జాబ్‌మేళాకు అనూహ్య స్పందన

జగ్గయ్యపేట, ఫిబ్రవరి 22 : రాష్ట్రంలో నిరుద్యోగులకు జాబు రావాలంటే బాబు రావాలని విజయవాడ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురాం, సీనియర్ టీడీపీ నేత కేశినేని చిన్ని, మాజీ ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్యలు పేర్కొన్నారు. పట్టణంలో శుభమస్తు కల్యాణమండపంలో గురువారం జాబ్‌మేళా ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న వారు మాట్లాడుతూ, నాలుగున్నరేళ్లుగా యువత ఉద్యోగాలు రాక నిరాశ నిస్పృహలతో మత్తుకు బానిసగా మారారని, యువశక్తి నిర్వీర్యం అవుతోందని ఆరోపించారు. ఉన్నత చదువులు చదివిన నిరుద్యోగులను రూ.5 వేలుతో వలంటీర్లగా నియమించి ఉద్యోగాలు ఇచ్చినట్టు ప్రచారం చేసుకుంటున్నారని ఆరోపించారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే రాష్ట్రంలో 20లక్షలు ఉద్యోగాలు ఇచ్చేందుకు ప్రణాళిక సిద్ధం చేశారని చెప్పారు. జాబులు కావాలంటే బాబు రావాల్సిందేనని అన్నారు.



అభ్యర్థులకు నియామకపత్రాలు అందజేస్తున్న టీడీపీ నేతలు

జాబ్‌మేళాకు అనూహ్య స్పందన

కేశినేని చిన్ని ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళకు నిరుద్యోగుల నుంచి అనూహ్య స్పందన లభించింది. 1567 మంది నిరుద్యోగులు రిజిస్ట్రేషన్లు చేసుకోగా 822 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని, 322 మందికి ఆఫర్ లెటర్స్ ఇచ్చారన్నారు. టీఎస్ఎస్ఎఫ్ సహకారంతో జగ్గయ్యపేట, నందిగామ నియోజకవర్గాల నిరుద్యోగుల కోసం మేళా ఏర్పాటు చేయగా.. రూ.15వేలు నుంచి గరిష్ఠంగా రూ.45వేలు వరకు ఉద్యోగాలు పొందిన వారికి నియామకపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.



ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతున్న పోరాట సమితి నేతలు

కాలుష్యం.. కాటేస్తోంది!

» ప్రాణ సంకటంగా వీటీపీఎస్ వ్యర్థాలు

» కాలుష్య నియంత్రణ పోరాట సమితి నేతల ఆవేదన

ధర్నాచౌక్, ఫిబ్రవరి 22 : ఇబ్రహీంపట్నంలో వీటీపీఎస్ ప్లాంట్ నుంచి వెలువడే వాయు కాలుష్యం, వందలాది వాహనాల నుంచి వచ్చే బూడిద కాలుష్యం నుంచి స్థానిక ప్రజల ప్రాణాలు కాపాడాలని వీటీపీఎస్ కాలుష్య నియంత్రణ పోరాట సమితి నేతలు రాష్ట్ర ప్రభుత్వాన్ని వేడుకున్నారు. గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. వీటీపీఎస్ సంస్థ నుంచి అధిక మొత్తంలో విడుదలవుతున్న కాలుష్య కారకాల వల్ల సుమారు 15 గ్రామాల్లో ప్రజలు తీవ్ర అనారోగ్యాల పాలై ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంస్థ ఏర్పాటుకు గతంలో పొలాలు ఇచ్చి.. ఇప్పుడు ప్రాణాలు కోల్పోవాలా? అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. సమస్య పరిష్కారానికి గత 15 రోజులుగా రోడ్లపైకి వచ్చి పోరాడుతున్నా స్థానిక ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. ఏపీ కాలుష్య మండలి అవినీతి మండలిగా మారిందని ఆరోపించారు. గతంలో ఇక్కడ అన్ని రకాల పంటలు పండేవని.. ఇప్పుడు కేవలం వరి, చెరుకు మాత్రమే పండుతున్నాయన్నారు. పశువులు సైతం మృత్యువాత పడుతున్నాయన్నారు. పాత ప్లాంట్‌లను 2017లోనే మూసివేయాలని సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ ఆదేశాలిచ్చినప్పటికి వాటిని 2024 వరకు నడపాలని ప్రయత్నిస్తున్నారన్నారు. 30 ఏళ్లు పైబడిన 1, 2 యూనిట్లను తక్షణమే మూసివేయాలని, స్థానికంగా మల్టీ స్పెషాల్టీ ఆసుపత్రి ఏర్పాటు చేసి కాలుష్య బాధితులకు ఉచితంగా వైద్యం అందించాలన్నారు. నిత్యం యథేచ్ఛగా తరలిస్తున్న బూడిద రవాణాను అరికట్టాలన్నారు. సమావేశంలో కమిటీ అధ్యక్షుడు చెరుకుపల్లి సురేష్, ప్రధానకార్యదర్శి షేక్ కరిముల్లా, చెరుకూరి వేణుగాపాలరావు, కె.అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీనామీ పేర్లతో భూముల దోపిడీ కుట్ర!

» అసైన్డ్ భూముల పేరుతో పేర్ని నాని రాజకీయం : కొల్లు రవీంద్ర ధ్వజం

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 22 : సర్వే నెంబర్లు లేకుండా స్ట్రీట్ సైడ్ అంటూ దొంగ పట్టాలు సృష్టిస్తున్నారని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు కొల్లు రవీంద్ర ధ్వజమెత్తారు. గురువారం మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నేషనల్ కాలేజీ వద్ద స్ట్రీట్ సైడ్ అంటూ పొజిషన్ సర్టిఫికెట్లు, దొంగ పట్టాలు ఇప్పిస్తున్నారన్నారు. ప్రజల సమస్యలను పట్టించుకోకుండా ఎన్నికల ముందు ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. టీడీపీ హయాంలోని జీప్లస్ 3 గృహాలను ఇప్పటికీ పేదలకు ఇవ్వలేదన్నారు. తన బీనామీలకు అసైన్డ్ భూములను కట్టబెట్టేందుకు ఎమ్మెల్యే పేర్ని నాని చూస్తున్నారన్నారు. జిల్లా కలెక్టర్, ఆర్డీవోలతో వెళ్లి అసైన్డ్ ల్యాండ్ పట్టాలు ఇవ్వాలని సీఎంవో ధనుంజయరెడ్డి వద్ద వత్తిడి తీసుకువస్తున్నారన్నారు. సామాజిక కార్యకర్త కొనకళ్ల గణపతిపేరున ఉన్న పార్కుకు మునిసిపల్ అడ్మినిస్ట్రేటివ్ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీలక్ష్మి పేరు పెట్టించి తద్వారా అడ్డగోలు అనుమతులు ఇప్పించారన్నారు. విశాఖలో గ్యాస్ ప్రమాదంలో మృతిచెందిన పేదలకు రూ. 25లక్షలు ఇచ్చిన వైసీపీ పాలకులు బందరులో అధికారుల నిర్లక్ష్యం కారణంగా బలైపోయిన పసిబిడ్డ కుటుంబానికి ఇప్పటి వరకు ఒక్కపైసా చెల్లించకపోవడం దారుణమన్నారు. టీడీపీ, జనసేన అధికారంలోకి రాగానే కరగ్రహారంలో సెంటు స్థలం ఇచ్చిన లబ్ధిదారులకు రెండు సెంట్లు ఇప్పించి ఆదుకుంటామన్నారు. కార్యక్రమంలో జిల్లా తెలుగురైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ, మాజీ జడ్పీటీసీ లంకే నారాయణ ప్రసాద్ తదితరులు మాట్లాడారు.



సర్వే నెంబర్లు లేకుండా ఉన్న పట్టాను మీడియాకు చూపుతున్న కొల్లు రవీంద్ర

నెలాఖరులో జయహో బీసీ.. : నెట్టెం

విద్యాధరపురం, ఫిబ్రవరి 22 : జిల్లాలో ఈ నెలాఖరున జయహో బీసీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ఎన్టీఆర్ జిల్లా టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురామ్ అన్నారు. ఆటోనగర్‌లోని జిల్లా కార్యాలయంలో గురువారం జిల్లా బీసీ సెల్ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నియోజకవర్గానికి 1500 మంది చొప్పున 10వేల మందికి తగ్గకుండా సభకు వచ్చేలా నాయకులు కార్యాచరణ చేయాలన్నారు. బీసీ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీరంకి వెంకట గురుమూర్తి మాట్లాడుతూ, ఏడు నియోజకవర్గాల్లో బీసీ సాధికారిక సంఘాల అధ్యక్ష కార్యదర్శులతో సమావేశాలు ఏర్పాటు చేసి జగన్‌రెడ్డి పాలనలో బీసీలకు జరుగుతున్న అన్యాయాలను వివరించాలన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి బీసీలకు జరిగిన మోసాలను తెలియజేయాలన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఎన్టీఆర్ జిల్లా బీసీసెల్ అధ్యక్షుడు మరక శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ, 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ' కార్యక్రమాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. కార్యక్రమంలో బీసీ నాయకులు ఉయ్యూరు నరసింహరావు, గంజం రాఘవేంద్రరావు, మల్లెల ఈశ్వరరావు, వెలగాల నూకాలమ్మ, మొండి జ్యోతి, శివకుమారి, శ్రావ్య, లీలా తదితరులు పాల్గొన్నారు.



బీసీ సెల్ సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు



పట్టాలు తప్పిన గూడ్స్ బోగీ

పట్టాలు తప్పిన గూడ్స్ రైలు

» రాయనపాడు వద్ద పట్టాలు తప్పిన ఐదు బోగీలు.. పలు రైళ్లు దారి మళ్లింపు

విజయవాడ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ-సికింద్రాబాద్ మెయిన్ లైన్‌లో రాయపాడు సమీపంలో గురువారం రాత్రి 10.30గంటల సమయంలో గూడ్స్ రైలు పట్టాలు తప్పింది. ఘటనలో ఐదు బోగీలు పట్టాలు తప్పాయి. ఈ గూడ్స్ రైలు సికింద్రాబాద్ నుంచి కాకినాడ సీ పోర్టుకు వెళ్లాల్సి ఉంది. రాయనపాడులో కొంత సమయం హాల్టింగ్ తర్వాత కాకినాడ సీ పోర్టుకు బయలుదేరాల్సి ఉండగా రాయనపాడుకు రైలు చేరుకోగానే పట్టాలు తప్పింది. ఈ ఘటనలో ఎలాంటి ప్రమాదం సంభవించలేదు. విషయం తెలియగానే రైల్వే ఉన్నతాధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితి సమీక్షిస్తున్నారు. సికింద్రాబాద్ నుంచి గ్రానైట్ రాయి లోడుతో రైలు వస్తోంది. సరుకుకు కూడా ఎలాంటి నష్టం వాటిల్ల లేదు. మెయిన్‌లైన్‌పై పట్టాలు తప్పడంతో రైళ్ల రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. ఈ కారణంగా పలు రైళ్లను రద్దు చేశారు. మచిలీపట్నం - బీదర్ (12749) రైలును విజయవాడ, కృష్ణా కెనాల్ జంక్షన్, గుంటూరు, పిడుగురాళ్ల మీదుగా మళ్లించారు. కాకినాడ పోర్టు - లింగంపల్లి (12737)ను కూడా విజయవాడ, కృష్ణా కెనాల్ జంక్షన్, గుంటూరు, పిడుగురాళ్ల మీదుగా మళ్లించారు. గూడూరు, సికింద్రాబాద్ (12709)ను తెనాలి, గుంటూరు, పగిడిపల్లిల మీదుగా మళ్లించారు.

ఏసీబీకి చిక్కిన శానిటరీ ఇన్‌స్పెక్టర్

» టిఫిన్ బండి పెట్టుకునేందుకు 8వేలు డిమాండ్

» లంచం తీసుకుంటూ పట్టుబడిన వైనం



శానిటరీ ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్

అవనిగడ్డ, ఫిబ్రవరి 22 : అవనిగడ్డ పంచాయతీలో శానిటరీ ఇన్‌స్పెక్టర్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న పవన్ కుమార్‌ను ఏసీబీ అధికారులు గురువారం వలపన్ని పట్టుకోవటం స్థానికంగా కలకలం రేకెత్తించింది. ఏసీబీ ఏఎస్పీ స్నేహిత పర్యవేక్షణలో ఇన్చార్జి డీఎస్పీ ప్రతాప్ నేతృత్వంలో ఈ దాడులు జరిగాయి. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం- అవనిగడ్డకు చెందిన ఆకుల సాయికృష్ణ టిఫిన్ బండి పెట్టుకునేందుకు పంచాయతీలో దరఖాస్తు చేసుకున్నాడు. అందుకు అనుమతి ఇవ్వాలంటే రూ.8 వేలు పవన్‌కుమార్ డిమాండ్ చేయడంతో విషయాన్ని ఏసీబీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లాడు. గురువారం ఉదయం పవన్‌కుమార్ సాయికృష్ణ నుంచి రూ.8 వేలు లంచం తీసుకుంటుండగా పట్టుకున్నట్టు ఏఎస్పీ స్నేహిత తెలిపారు. విచారణ అనంతరం పవన్‌కుమార్ రిమాండ్‌కు పంపినట్టు చెప్పారు దాడుల్లో ఏసీబీ అధికారులు శ్రీనివాస్, నాగరాజు, సురేష్, రవి కిరణ్, సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తలశిల స్వర్ణలత, కొనకళ్ల నారాయణ

మహిళా గళం విజయవంతం చేయండి

» తలశిల స్వర్ణలత పిలుపు

చల్లపల్లి, ఫిబ్రవరి 22 : మార్చి 4న గుడివాడలో జరిగే 'మహిళా గళం' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలుగుమహిళ జిల్లా అధ్యక్షురాలు తలశిల స్వర్ణలత పిలుపునిచ్చారు. గురువారం తెలుగుమహిళా నేతల సమావేశంలో స్వర్ణలత మాట్లాడుతూ, గుడివాడలో జరిగే 'మహిళా గళం' ద్వారా మహిళల గళాన్ని ప్రభుత్వానికి వినిపించాలన్నారు. తెలుగుమహిళలు, వీర మహిళలు, మహిళా ప్రజాప్రతినిధులు, మహిళలు సదస్సులో పాల్గొనేలా చూడాలని కోరారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణ మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రభుత్వ అస్తవ్యస్త విధానాలు ఎలుగెత్తి చాటడంలో తెలుగుమహిళల పాత్ర ముఖ్యమైనదన్నారు. జిల్లా తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి పైడిపాముల కృష్ణకుమారి, అధికార ప్రతినిధి పైనేని ఇందిర, నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులు బండె కనకదుర్గ, మోర్ల జయలక్ష్మి, ఎంపీపీలు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.



రైతుబజార్‌లో మూయించిన స్టాలు

రైతుబజార్‌లోనూ రాజకీయం!

» భర్తలు పార్టీ మారారని భార్యలపై ఎమ్మెల్యే వెలంపల్లి కక్ష సాధింపు

» డ్వాక్రా మహిళల స్టాళ్లు మూసివేత

పాయకాపురం, ఫిబ్రవరి 22 : ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో వైసీపీ నేతలు దిగజారుడు రాజకీయాలకు తెరతీస్తూ పేదల కడుపుకొడుతున్నారు. భర్తలు పార్టీ మారారని, భార్యలపై ఎమ్మెల్యే వెలంపల్లి కక్ష సాధింపులకు దిగడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. సెంట్రల్ నియోజకవర్గంలో వైసీపీ నుంచి తెలుగుదేశం పార్టీకి ఇటీవల భారీగా వలసలు పెరిగాయి. వైసీపీలోని పలువురు కార్యకర్తలు పార్టీ పోకడలతో విసిగిపోయి తెలుగుదేశం పార్టీ కండువాలు కప్పుకుంటున్నారు. వీరిని కట్టడి చేసేందుకు వైసీపీ సెంట్రల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెలంపల్లి శ్రీనివాస్ కక్షసాధింపు చర్యలకు దిగడం గమనార్హం.

పాయకాపురం మోడల్ రైతుబజార్‌లో రెండేళ్ల క్రితం కూరగాయల విక్రయాలకు దరఖాస్తు చేసుకుని స్రవంతి, చామంతి డ్వాక్రా గ్రూపుల మహిళలు స్టాళ్లు నిర్వహిస్తున్నారు. అయితే ఇటీవల ఇద్దరు మహిళల భర్తలు వైసీపీ కార్యకర్తలుగా ఉంటూ పార్టీ పోకడలతో విసిగిపోయి సెంట్రల్ టీడీపీ నేత బొండా ఉమా సమక్షంలో పార్టీలో చేరారు. వారు పార్టీలో చేరిన రెండురోజుల్లో రైతుబజార్‌లో మహిళలకు చెందిన రెండు దుకాణాలను వెలంపల్లి, స్థానిక వైసీపీ నేత కలిసి మూయించి వేశారు. నేతలు ఆదేశాలే తడవుగా రైతుబజార్ ఈవో దుకాణాలు మూయించి వేయడంతో సదరు మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భర్తలు పార్టీ మారితే తమ దుకాణాలను మూయించడం అన్యాయమని, చిరువ్యాపారులపై తమ ప్రతాపం చూపి రాజకీయాలకు బలిచేయడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదేనా జగనన్న అక్కచెల్లెమ్మలకు ఇచ్చే గౌరవం అంటూ వారు ప్రశ్నిస్తున్నారు.



రైతుబజార్‌లో డ్వాక్రా మహిళ స్టాలు

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	159, 168, 179
చికెన్ విత్ స్కిన్	308
చికెన్ స్కిన్‌లెస్	316

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.15

ఎస్సైగా ఎంపికైన ఫైర్‌మన్ పృథ్వీ యాదవ్‌కు సత్కారం



హనుమాన్‌జంక్షన్, ఫిబ్రవరి 22 : పట్టుదలతో సాధన చేస్తే విజయం తథ్యమని హనుమాన్‌జంక్షన్ అగ్నిమాపక కేంద్రం అగ్నిమాపక అధికారి రామ్మోహన్‌రావు అన్నారు. ఫైర్‌మన్‌గా పనిచేస్తున్న నందివాడ మండలం తమిరిశ గ్రామానికి చెందిన సాదం పృథ్వీయాదవ్ ఏపీ పోలీస్ పరీక్షల్లో విజయం సాధించి ఎస్సైగా ఎంపికయ్యాడు. ఎస్సై శిక్షణకు అనంతపురం వెళుతున్న సందర్భంగా గురువారం కేంద్రంలో పృథ్వీని అభినందిస్తూ అగ్నిమాపక సిబ్బంది ఘనంగా సత్కరించారు.

2047 నాటికి విశ్వగురువుగా భారత్ : వడ్డే



విద్యార్థులకు బహుమతులందజేస్తున్న వడ్డే

ఉయ్యూరు, ఫిబ్రవరి 22 : భారతదేశం 2047 నాటికి విశ్వగురువుగా అవతరించేందుకు ప్రతి పౌరుడు బాధ్యతతో వ్యవహరించాలని మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు అన్నారు. ఏజీ అండ్ ఎస్‌జీ ఎస్ కళాశాలలో గురువారం జాతీయ సేవా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన యువ సంవాద్ ఇండియా-2047 కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. అభివృద్ధి చెందిన భారతదేశ సంకల్పం, వలసవాద మనస్తత్వం జాడను తొలగించడం, పౌరుల విధులను నిజాయితీతో నెరవేర్చడం అనే అంశాలపై వక్తృత్వ పోటీల విజేతలకు మోదీ 20 పుస్తకాలను అందజేశారు. కళాశాల కన్వీనర్ టి.శ్రీహరిరావు, ఏవో ఎల్‌కె మోహన్‌రావు, స్పెషల్ ఆఫీసర్ సత్యనారాయణ, ప్రిన్సిపాల్ వి.శ్రీరామ్, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు ఇస్మాయిల్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు కె.శేఖర్‌బాబు, టి.నరసింహారావు, ఎండి నూర్ పాల్గొన్నారు.

పేదలకు రేషన్ బియ్యం సక్రమంగా అందించాలి



డీటీ వెంకటరమణకు వినతిపత్రం అందజేస్తున్న అట్లూరి, గార్లపాటి

హనుమాన్‌జంక్షన్ : పేదలకు రేషన్ బియ్యం సక్రమంగా అందించకపోతే ఆందోళన చేపడతామని బాపులపాడు గ్రామ టీడీపీ నాయకులు హెచ్చరించారు. గ్రామంలోని ఎనిమిదో వార్డు లో గత నాలుగు నెలలుగా పేదలకు రేషన్ బియ్యం సక్రమంగా ఇవ్వడం లేదని పేర్కొంటూ గ్రామ టీడీపీ అధ్యక్ష కార్యదర్శులు అట్లూరి శ్రీనివాసరావు, గార్లపాటి రాజేశ్వరరావు గురువారం తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. రేషన్ డీలర్‌పై చర్యలు కోరుతూ డీటీ వెంకటరమణకు వినతి పత్రం అందజేశారు. మండల టీడీపీ అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు, మొవ్వా వెంకటేశ్వరరావు, వడ్డిల్లీ లక్ష్మి, కంపసాటి కొండలరావు పాల్గొన్నారు.

వైసీపీని వీడే ఆలోచనలో కమ్మ కార్పొరేషన్ చైర్మన్!



ఆంజనేయులు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న చంద్రశేఖర్

కంకిపాడు : కమ్మ కార్పొరేషన్ చైర్మన్ తుమ్మల చంద్రశేఖర్ వైసీపీని వీడే యోచనలో ఉన్నట్లు సమాచారం. కోలవెన్ను గ్రామంలో గురువారం తుమ్మల ఆంజనేయులు 13వ వర్ధంతి కార్యక్రమాన్ని బుడ్డి యువసేన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కమ్మ కార్పొరేషన్ చైర్మన్ తుమ్మల చంద్రశేఖర్ (బుడ్డి) హాజరయ్యారు. ముందుగా తుమ్మల అంజనేయులు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నియోజకవర్గంలోని తుమ్మల బుడ్డి యువ సేన, కోలవెన్ను సర్పంచ్ సురేష్, వైసీపీ నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. పెనమలూరు నియోజకవర్గ సమన్వయ కర్తగా జోగి రమేష్‌ను ప్రకటించిన సమయంలో నియోజకవర్గంలోని ఒక్కరితో కూడా సంప్రదించలేదన్నారు. నియోజకవర్గంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారన్న ఆలోచన వైసీపీ అధిష్ఠానానికి లేదని ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. పార్టీలో తమకు విలువ లేదన్నారు. విలువ లేని పార్టీలో తాము కొనసాగలేమన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తల అభీష్ట మేరకు త్వరలో నిర్ణయం ప్రకటిస్తామని చెప్పారు.



ఈడుపుగల్లులో బాబు ష్యూరిటీ కార్యక్రమంలో బోడె ప్రసాద్



ఇందిరానగర్ కట్టపై బోడె హేమ ప్రచారం



పాత్రికేయులపై దాడికి నిరసన తెలుపుతున్న వెలగపూడి శంకరబాబు

జగన్ అరాచకానికి చెక్ పెట్టాలి

● బాబు ష్యూరిటీ..భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో బోడె ప్రసాద్ పిలుపు

ఈడుపుగల్లు (కంకిపాడు), ఫిబ్రవరి 22 : ఓటమి భయంతో జగన్ చేస్తున్న అరాచకానికి చెక్ పెట్టాలని పెనమలూరు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పిలుపునిచ్చారు. ఈడుపుగల్లులో గురువారం బాబు ష్యూరిటీ..భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దేవినేని రాజాతో కలిసి ఆయన పాల్గొన్నారు. బోడె ప్రసాద్ మాట్లాడుతూ ఎన్నికల్లో వైసీపీ ఓడిపోతుందని ముందే గమనించిన జగన్ మోహన్ రెడ్డి తన అరాచక మూకలతో దాడులకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు ఇదే విధంగా దాడులకు పాల్పడి ఉంటే జగన్ ముఖ్యమంత్రి అయ్యే వాడా అని ప్రశ్నించారు. టీడీపీ, జనసేన పార్టీ నాయకులు యుద్ధానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈడుపుగల్లు టీడీపీ అధ్యక్షుడు షేక్ షకార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ, సర్పంచ్ వందిపాటి ఇందిర, మండల టీడీపీ అధ్యక్షుడుసుదిమళ్ల రవీంద్ర, స్థానిక టీడీపీ నాయకులు ముక్కాముల శంకర్, వీరపనేని వెంకటేశ్వరరావు, అనుమోలు రామకృష్ణ, షేక్ మాబు సుభాని, పుట్టగుంట రవి, కిలారు శ్రీను, షేక్ సలీం, పులి విజయ్, ఉయ్యూరు మహేష్, మండల స్థాయి నాయకులు పులి శ్రీనివాసరావు, ఏనుగ జయప్రకాష్, కొండా నాగేశ్వరరావు, షేక్ బాజీ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీని చిత్తు చిత్తుగా ఓడించండి

పెనమలూరు : వచ్చే ఎన్నికల్లో సైకో జగన్‌రెడ్డి ప్రభుత్వాన్ని ప్రజలు చిత్తు చిత్తుగా ఓడించాలని టీడీపీ నాయకురాలు బోడె హేమ పిలుపునిచ్చారు. యనమలకుదురు ఇందిరానగర్ కట్టపై గురువారం బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో స్థానిక నాయకులతో కలిసి ఆమె ప్రజలతో మాట్లాడారు. ఐదేళ్లుగా రాష్ట్ర ప్రజలను, టీడీపీ నాయకులను వేధిస్తున్న సైకో జగన్‌రెడ్డిని రాష్ట్రం నుంచి పారదోలి రాష్ట్రాన్ని కాపాడుకోవాలని ఆమె కోరారు. రాష్ట్రంలోని అన్ని రంగాలను ధ్వంసం చేసిన జగన్‌రెడ్డికి ముఖ్యమంత్రిగా ఒక్క క్షణం కూడా ఉండే హక్కులేదని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో పెనమలూరు ఎమ్మెల్యేగా బోడె ప్రసాద్‌ను, రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబును ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు. అనంతనేని ఆజాద్, మొక్కపాటి శ్రీనివాస్, తుమ్మల రాంకుమార్, తమ్ము అశోక్, ఇబ్రహీం, బలగం నాగరాజు, జన్ను నాగరాజు, బెజవాడ వెంకటేష్, సింగం సుబ్రహ్మణ్యం, గోగినేని రామారావు, కిలారు శ్రీనివాస్, మారం భరద్వాజ్, కొక్కిలిగడ్డ సంగీతరావు, నాగేశ్వరరావు, షేక్ షకీలా, పండల రజిని తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాల్లో వైసీపీ అక్రమాలపై కన్నేసి ఉంచండి



మాట్లాడుతున్న బోడె ప్రసాద్

పెనమలూరు, ఫిబ్రవరి 22 : ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అయ్యేంత వరకు ఓటర్ల జాబితాల్లో మార్పులు చేర్పులకు అవకాశం ఉన్నందున, వైసీపీ అక్రమాలకు పాల్పడటం ఖాయమని, టీడీపీ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పిలుపునిచ్చారు. పోరంకి టీడీపీ కార్యాలయంలో ఐదో క్లస్టర్ పరిధిలోని యూనిట్, బూత్ కన్వీనర్లతో సమావేశమై చర్చించారు. మృతి చెందిన వారి ఓట్ల తొలగింపు, బహుళ ఎంట్రీల పట్ల జాగ్రత్త వహించాలని కోరారు. ఓటర్ల జాబితాల్లో ఇప్పటికే చాలావరకు అవకతవకలు టీడీపీ శ్రేణులు గుర్తించాయన్నారు. త్వరలో నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో బూత్‌ల పరిధిలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై పలు సూచనలు చేశారు. నాయకులు అనుమోలు ప్రభాకరరావు, సంగెపు రంగారావు, వడ్లమూడి శుభశేఖర్, అంగిరేకుల మురళి, పీతా గోపీచంద్, క్లస్టరు ఇన్‌చార్జిలు, యూనిట్ ఇన్‌చార్జిలు తదితరులు పాల్గొన్నారు.

పాత్రికేయులపై దాడికి టీడీపీ నిరసన

పెనమలూరు, ఫిబ్రవరి 22 : పాత్రికేయులపై దాడి ప్రజాస్వామ్యంపై దాడిగా జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు వెలగపూడి శంకరబాబు, మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ బుజ్జి పేర్కొన్నారు. పాత్రికేయులపై దాడిని ఖండిస్తూ కానూరులో గురువారం టీడీపీ శ్రేణులు నిరసన తెలిపారు. కానూరు టీడీపీ కార్యాలయంలో శంకరబాబు విలేకరులతో మాట్లాడుతూ ప్రజాసమస్యలను, ప్రభుత్వ అక్రమాలను నిరంతరం వెలికి తీసే పాత్రికేయులపై దాడులు హేయమన్నారు. దాడులకు పాల్పడిన దుండగులు స్పష్టంగా కనిపిస్తున్నా పోలీసులు ఎందుకు అరెస్టు చెయడంం లేదో చెప్పాలని డిమాండ్ చేశారు. ఇక్బాల్, షేక్ రఫీ, ఇమాం, రియాజ్, అబ్దుల్ రెహమాన్, కొండ్రు కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులపై దాడులు అరికట్టాలి : ఏపీడబ్ల్యూజేఎఫ్

గన్నవరం, ఫిబ్రవరి 22 : పాత్రికేయులపై దాడులను అరికట్టాలని ఏపీడబ్ల్యూజెఎఫ్ జిల్లా నాయకులు ఎన్ .శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ శ్రేణులు మూకుమ్మడిగా దాడి చేయటం అత్యంత దారుణమన్నారు. దాడి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.



ప్రతిభా పురస్కార గ్రహీతలతో మానవత కన్వీనర్ కోటేశ్వరరావు, హెచ్‌ఎం దుర్గాప్రసాద్, కార్యదర్శి కళ్లేపల్లి నారాయణరావు

నైతిక విలువలు పాటించాలి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఫిబ్రవరి 22 : నైతిక విలువలతో కూడిన జీవితంతోనే సమున్నత లక్ష్యాలను సాధిస్తూ ముందుకు సాగితే నవ సమాజ నిర్మాణం సాధ్యమని మానవత రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు విద్యార్థులకు సూచించారు. ఆరుగొలను హైస్కూల్‌లో హెచ్‌ఎం .దుర్గాప్రసాద్ అధ్యక్షతన విద్యార్థులకు మానవత ఆధ్వర్యంలో గురువారం కెరీర్ గైడెన్స్ నిర్వహించారు. పెద్దలను, గురువులను గౌరవిస్తూ ఇష్టంగా చదివితే సమున్నత లక్ష్యాలు సాధించవచ్చన్నారు. విలువలతో కూడిన విద్యతోనే జీవితంలో ఎన్నో సమస్యలను అధిగమించవచ్చని సూచించారు. పబ్లిక్ పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ స్థానం సాధించిన విద్యార్థులకు నగదు పురస్కారంతో పాటు ప్రశంసాపత్రం, జ్ఞాపికను అందజేశారు. మానవత అధ్యక్షుడు కూరెళ్ల సుబ్బాచారి, కార్యదర్శి కళ్లేపల్లి నారాయణరావు, డైరెక్టర్ కొట్నాని రామచంద్రరావు, చెక్క సుబ్బారావు, శ్రీరామ్మూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కంకిపాడు ఎంపీడీవో కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

చలో విజయవాడ విజయవంతం చేయండి

కంకిపాడు, ఫిబ్రవరి 22 : ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 27వ తేదీన చేపట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏపీ ఎన్జీవో కంకిపాడు యూనిట్ అధ్యక్షుడు ఉండి పురుషోత్తమరాజు పిలుపునిచ్చారు. కంకిపాడు ఎంపీడీవో కార్యాలయం వద్ద గురువారం యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పురుషోత్తమరాజు మాట్లాడుతూ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని అనేక మార్లు ప్రభుత్వంతో చర్చించినా ఫలితం లేకుండా పోయిందన్నారు. సమస్యలు పరిష్కరించేంత వరకు ఉద్యమిస్తామని హెచ్చరించారు. పి. కృష్ణారావు, సురేష్, రామకృష్ణ, శ్రీనివాస, శ్యామల, మునిరాజు, మండవ శ్రీనివాసు, ఎ. వెంకటేశ్వరరావు, మాధవరావు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినులకు అల్పాహారం అందిస్తున్న రక్ష ఫౌండేషన్ చైర్‌పర్సన్ స్నిగ్ధ

స్వచ్ఛంద సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ప్రొద్దుటూరు (కంకిపాడు), ఫిబ్రవరి 22 : ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థ అందిస్తున్న సహకారాన్ని అందిపుచ్చుకొని విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని రక్ష ఫౌండేషన్ చైర్‌పర్సన్ పడమట స్నిగ్ధ అన్నారు. ప్రొద్దుటూరు జిల్లా పరిషత్ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు అవసరమైన అల్పాహారాన్ని అందజేశారు. స్నిగ్ధ మాట్లాడుతూ ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తున్నాయన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగ పరుచుకోవాలని కోరారు. హెచ్‌ఎం అరుణకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



తెలుగుతల్లి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మండలి బుద్ధప్రసాద్

మాతృ భాషాభివృద్ధికి ఐక్య కృషి : మండలి

ఉయ్యూరు, ఫిబ్రవరి 22 : మాతృభాషను సజీవంగా నిలిపేందుకు అందరూ కృషి చేయాలని మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ సూచించారు. స్వచ్ఛంద సంస్థ సరస భారతి స్థాపించి తెలుగుభాష, సాహిత్యం కోసం ప్రత్యేక కృషి చేస్తున్న సాహితీవేత్త గబ్బిట దుర్గాప్రసాద్ సన్మాన కార్యక్రమంలో గురువారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మండలి మాట్లాడుతూ, సరసరభారతి ద్వారా సాహిత్య కార్యక్రమాలు నిర్వహిస్తూ మాతృభాషను మరువనీయకుండా గబ్బిట దుర్గాప్రసాద్ కార్యక్రమాలు నిర్వహించడం ప్రశంసనీయమన్నారు. తెలుగుదనంలో ఉండే కమ్మదనం పిల్లలకు అందిస్తూ మాతృభాష గొప్పదనాన్ని తల్లిదండ్రులు తెలియజెప్పాలని మాజీ ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్రప్రసాద్ అన్నారు. దుర్గాప్రసాద్ తనకు విద్యనేర్పిన గురువు కావడం గర్వకారణంగా భావిస్తున్నట్టు చెప్పారు. వి.సత్యనారాయణ, రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు గుత్తికొండ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



లక్ష్మీతిరుపతమ్మకు కుంకుమార్చన చేస్తున్న భక్తులు

వైభవంగా లక్ష్మీ తిరుపతమ్మకు కుంకుమార్చన

గన్నవరం, ఫిబ్రవరి 22 : పాత గన్నవరంలోని లక్ష్మీ తిరుపతమ్మ ఆలయంలో గురువారం లక్ష కుంకుమార్చన వైభవంగా నిర్వహించారు. ఈ నెల 23న జరగనున్న అమ్మవారి కల్యాణాన్ని పురస్కరించుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కుంకుమార్చన నిర్వహించారు. తొలుత లక్ష్మీ తిరుపతమ్మను పెండ్లి కుమార్తెగా అలంకరించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. దంపతులు మహా శాంతి హోమం నిర్వహించారు. సాయంత్రం మండల దీక్ష పారాయణం ముగింపు కలశ ఉద్వాసన జరిపారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సువాసినిలచే లక్ష కుంకుమార్చన నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్ పలువురు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి వాటర్ కూలర్ వితరణ



గన్నవరం, ఫిబ్రవరి 22 : గ్రంథాలయాలకు దాతల సహకారం అభినందనీయమని జడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి అన్నారు. పురుషోత్తపట్నం శాఖా గ్రంథాలయానికి గామానికి చెందిన యలమంచిలి వెంకట శివ ప్రసాద్, సుజాత కుమారుడు సందీప్ (యుఎస్‌ఏ) గురువారం వాటర్ కూలర్‌ను అందజేశారు. ఎలిజబెత్ రాణి మాట్లాడుతూ పాఠకులకు వసతుల కల్పనలో దాతల భాగస్వామ్యం అవసరమన్నారు. పది మందికి ఉపయోగపడే వాటర్ కూలర్ అందజేసిన దాతను అభినందించారు. అనంతరం దాతను దుశ్శాలువ, పుష్పగుచ్ఛంతో సత్కరించారు. లైబ్రేరియన్ కె.కృపానందం, గ్రామ ప్రముఖులు గుమ్మడి వెంకట్రామయ్య, మాదల సాంబశివరావు, కొడాలి శ్రీనివాసరావు, కొమ్మినేని మల్లిఖార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

అధికారులపై తీసుకున్న చర్యలపై నివేదిక కోరిన లోకాయుక్త

ఉయ్యూరు, ఫిబ్రవరి 22 : ఉయ్యూరు నగర పంచాయతీలో అక్రమ లేఅవుట్ల నుంచి రూ. 7కోట్ల 19 లక్షలు వసూలు చేయాల్సిందిగా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గతంలో నివేదిక ఇచ్చారు. అయితే, ఏప్రిల్ 12, 2023 నుంచి ఇప్పటి వరకు పని చేసిన 21 మంది కమిషనర్లు, 12 మంది టౌన్‌ప్లానింగ్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఈ నేపథ్యంలో సదరు అధికారులపై తీసుకున్న క్రమ శిక్షణా చర్యలపై మున్సిపల్ మరియు పట్టణాభివృద్ధిశాఖ, రాజమహేంద్రవరం రీజినల్ డైరెక్టర్ ఎన్.వి.వి. సత్యనారాయణరావును నివేదిక కోరుతూ రాష్ట్ర లోకాయుక్త జస్టిస్ పి.లక్ష్మణరెడ్డి ఆదేశాలు జారీ చేసినట్టు సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాసగౌడ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

అరెస్టులతో ప్రజా ఉద్యమాన్ని ఆపలేరు : నందూరి



హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఫిబ్రవరి 22 : వైసీపీ ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేసిందని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నందూరి శ్రీనివాసరావు విమర్శించారు. మల్లవల్లిలోని స్వగృహంలో ఆయనకు, ఎస్.ఎన్.పాలెం శివారు ముందడుగు కాలనీలో నివసిస్తున్న మట్టా వరప్రసాద్‌కు పోలీసులు బుధవారం అర్ధరాత్రి నోటీసులు అందజేసి గృహ నిర్బంధంలోని తీసుకున్నారు. చలో సెక్రటేరియట్‌కు అనుమతులు లేనందువల్ల సదరు కార్యక్రమానికి వెళ్లరాదన్నారు. పడకల శ్రీనివాసరావు, వేమూరి సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	159, 168, 179
చికెన్ విత్ స్కిన్	308
చికెన్ స్కిన్‌లెస్	316



నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.15

వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

కూచిపూడి, ఫిబ్రవరి 22: రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలు గురువారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. విష్వక్సేన పూజ, స్వామి, అమ్మవార్లను పెళ్లి కుమారుడిని, పెళ్లి కుమార్తెను చేయుట, మహాకవి క్షేత్రయ్య ఆరాధనోత్సవం, గ్రామ సంకీర్తన, విశేష పూజలను అర్చకులు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



స్వామి, అమ్మవార్లను పెళ్లి కుమారుడు, పెళ్లి కుమార్తెగా ముస్తాబు చేస్తున్న అర్చకుడు

మహాశివరాత్రి ఉత్సవాల విజయవంతానికి

సమన్వయంతో పనిచేయండి

● పెదకళ్లేపల్లిలో ఉద్యోగులకు ఆర్డీవో ఎం.వాణి ఆదేశం

మోపిదేవి, ఫిబ్రవరి 22: అన్ని శాఖల ప్రభుత్వ ఉద్యోగులు సమన్వయంతో పనిచేసి మహాశివరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయాలని మచిలీపట్నం ఆర్డీవో ఎం.వాణి ఆదేశించారు. గురువారం పెదకళ్లేపల్లిలో దుర్గా నాగేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలో మహాశివరాత్రి ఏర్పాట్లపై అన్ని శాఖల ఉద్యోగులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. మహాశివరాత్రికి పెదకళ్లేపల్లి కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు లక్ష మందికిపైగా భక్తులు వస్తారని, మార్చి 8, 9 తేదీల్లో కృష్ణానదిలో పుణ్య స్నానాలకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆమె ఆదేశించారు. స్నానఘాట్లను శుభ్రం చేయించాలని, మోపిదేవి, చల్లపల్లి నుంచి పెదకళ్లేపల్లికి వచ్చే గుంతలమయంగా ఉన్న రహదారులను తాత్కాలికంగా మరమ్మతులు చేయించాలని గ్రామస్థులు ఆర్డీవో దృష్టికి తెచ్చారు. దేవస్థానం ఆధ్వర్యంలో ఉచితంగా పులిహోర, మంచినీరు అందించి సత్వరమే దర్శనమయ్యేలా ప్రత్యేకంగా క్యూలైన్లు ఏర్పాటు చేస్తామని ఆర్డీవోకు ఆలయ ఈవో ఎన్.ఎస్. చక్రధరరావు తెలిపారు. అవనిగడ్డ డీఎస్పీ మురళీధర్, సర్పంచ్ అరజా సంధ్యారాణి, వైస్ ఎంపీపీ కడవకొల్లు రామాంజనేయులు, ఎంపీటీసీ సభ్యురాలు అరజా ఆశాదేవి, చల్లపల్లి సీఐ నాగప్రసాద్, ఎంపీడీవో శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

లే అవుట్‌లో ఆక్రమణలు వెంటనే తొలగించండి



లే అవుట్ -3లో ఎస్టీల సమస్యలు తెలుసుకుంటున్న ఆర్డీవో వాణి

మోపిదేవి, ఫిబ్రవరి 22: పేదల కోసం ఇచ్చిన లే అవుట్‌ను అక్రమార్కులు ఆక్రమించుకుంటే ఏం చేస్తున్నారంటూ మండల రెవెన్యూ ఉద్యోగులపై మచిలీపట్నం ఆర్డీవో వాణి ఆగ్రహం వ్యక్తం చేశారు. మోపిదేవిలో రావివారిపాలెం వెళ్లే రోడ్డులో లే అవుట్ -3లో రహదారి, డ్రెయిన్ల ఆక్రమణలను వెంటనే తొలగించి ఎస్టీ లబ్ధిదారులకు మౌలిక వసతులు కల్పించాలని ఆమె సూచించారు. గురువారం లే అవుట్‌ను ఆమె పరిశీలించారు. గృహాలు నిర్మించుకున్న లబ్ధిదారులను సమస్యలు తెలుసుకున్నారు. రహదారి, తాగునీరు, మౌలిక వసతులు కల్పించలేదని వారు ఆర్డీవో ఎదుట వాపోయారు. వర్షాకాలంలో గృహాల ఎదురుగా ఉన్న మురుగు డ్రెయిన్‌లో నుంచే రాకపోకలు సాగించాల్సి వస్తోందని, గృహాలకు ఇరువైపులా రహదారి, డ్రెయిన్ ఆక్రమించుకుని రాకపోకలు సాగించకుండా ఇబ్బంది పెడుతున్నారని ఆర్డీవో వద్ద మొరపెట్టుకున్నారు. దీంతో స్థానిక అధికారులపై ఆర్డీవో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆక్రమణలు తొలగించి నివేదిక అందజేయాలని తహసీల్దార్‌కు సూచించారు. తహసీల్దార్ ఎం.శ్రీవిద్య, ఆర్ఐ సునీల్‌కుమార్, వీఆర్వోలు మూర్తి, రమణ, జనసేన మండల అధ్యక్షుడు పూషడపు రత్నగోపాల్, మెరకనపల్లి నరేష్, సాంబశివరావు, లోలాక్షుడు తదితరులు కాలనీలో లబ్ధిదారులు పడుతున్న సమస్యలు ఆర్డీవో దృష్టికి తీసుకొచ్చారు.

మల్లాడి దుర్గారావుకు గోదావరి కీర్తి పురస్కారం

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 22: రాజమండ్రిలో ఫిలాంత్రోఫిక్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవంలో బందరుకోటకు చెందిన ప్రముఖ కార్టూనిస్టు మల్లాడి దుర్గారావు గోదావరి కీర్తి పురస్కారాన్ని అందుకున్నారు. తెలంగాణ పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ పగిడిపల్లి రాజారావు, ఏపీ మీడియా అకాడమీ కార్యదర్శి ఎం.బాలగంగాధర తిలక్, సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు అద్దంకి రాజా యోనాలు దుర్గారావుకు ఈ పురస్కారాన్ని అందచేశారు.

కొల్లూరి చిన్నాకు

సేవాభూషణ్

పెడన, ఫిబ్రవరి 22: కొల్లూరి చారిటబుల్ ట్రస్టు చైర్మన్ కొల్లూరి చిన్నా సేవాభూషణ్ పురస్కారానికి ఎంపికయ్యారు. నిరుపేదలకు అందిస్తున్న సేవలను గుర్తిస్తూ గోదావరిఖనికి చెందిన వెలుగు స్వచ్ఛంద సంస్థ ఈ పురస్కారానికి చిన్నాను ఎంపిక చేసింది. ఉగాది రోజున వెలుగు సంస్థ వ్యవస్థాపకుడు సురభి శ్రీధర్ నుంచి పురస్కారాన్ని అందుకుంటారు.

అభివృద్ధికి ఆమడదూరాన

మురికివాడలు

స్లమ్‌లలో కనీస సౌకర్యాలు కల్పించలేదీ ప్రభుత్వం: కొల్లు రవీంద్ర



ఆదర్శనగర్‌లో దివ్యాంగుడికి ట్రైసైకిల్ అందిస్తున్న కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 22: మురికివాడల అభివృద్ధిపై వైసీపీ ప్రభుత్వం దృష్టి సారించలేదని, సరైన వసతి సౌకర్యాలు లేక మురికివాడల్లో నివసించే ప్రజలు అభివృద్ధికి ఆమడదూరాన ఉన్నారని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కొల్లు రవీంద్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. వైసీపీ నిర్లక్ష్యం కారణంగా ఎస్సీ, ఎస్టీ, బీసీలు ఆర్థికంగా ఆశించినస్థాయికి ఎదగలేక పోయారని ఆయన అన్నారు. గురువారం 11 వడివిజన్‌లోని ఆదర్శనగర్ తదితర ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. దివ్యాంగులకు ట్రై సైకిళ్లు పంపిణీ చేశారు. టీడీపీ హయాంలో నిర్మించిన డ్రెయిన్‌వాటర్ లిఫ్టింగ్ కేంద్ర భవనం వద్ద రవీంద్ర సెల్ఫీ దిగారు. వైసీపీ ప్రభుత్వం ఇచ్చేది రూ.10 అయితే ప్రజల వద్ద పన్నుల రూపేణా ఇతరత్రా రూ.100 లాక్కుంటోందన్నారు. టీడీపీ హయాంలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు సబ్సిడీపై రుణాలు ఇచ్చేవారని, ఇప్పుడా సబ్సిడీ రుణాలు రద్దు చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. చిన్నం శివ పాల్గొన్నారు.

అన్ని వర్గాలనూ మోసగించిందీ ప్రభుత్వం

కోడూరు: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, విద్యార్థులు, రైతులను వైసీపీ ప్రభుత్వం మోసగించిందని టీడీపీ మండల అధ్యక్షుడు బండే శ్రీనివాసరావు విమర్శించారు. గురువారం బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాన్ని కోడూరులో ఆయన నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి కరపత్రాలను పంపిణీ చేసి చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. కొక్కిలిగడ్డ జాన్ విల్సన్, పాశం పాండురంగారావు, గోగినేని సోమశేఖరరావు, పిల్లి మల్లికార్జునరావు, మేడా శివాజీ, పూతబోయిన శ్రీనివాసరావు, ఉల్లి శేషగిరి, దామెర్ల నారాయణ, మహమ్మద్ ఇమ్రాన్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారెంటీ

గుడివాడ: టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెనిగండ్ల రాము ఆధ్వర్యంలో 36వ వార్డులో గురువారం బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, అర్బన్ బ్యాంకు చైర్మన్ పిన్నమనేని బాబ్జి, నాయకులు యలవర్తి శ్రీనివాసరావు, దింట్యాల రాంబాబు, గోర్జి సత్యనారాయణ, లింగం ప్రసాద్, మజ్జి శ్రీనివాసరావు, వసంతవాడ దుర్గారావు, గొరిపర్తి శ్రీను, గొర్ల శ్రీలక్ష్మి, ఆసిలేటి నిర్మల తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో కుల, మత చిచ్చులు పెట్టిందీ ప్రభుత్వం: వర్ల కుమార్‌రాజా



మేడూరులో పల్లెబాట కార్యక్రమంలో పాల్గొన్న కుమార్‌రాజా

పమిడిముక్కల: "వైసీపీ పాలనలో గ్రామాల్లో మౌలిక వసతులు లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. చంద్రబాబు హయాంలో పచ్చదనం, పరిశుభ్రత, అభివృద్ధితో కళకళలాడిన గ్రామాలు నేడు జగన్ రగిల్చిన కుల, మత, ప్రాంతీయ చిచ్చుతో అట్టుడుకుతున్నాయి." అని టీడీపీ పామర్రు నియోజకవర్గ ఇన్‌చార్జ్ వర్ల కుమార్‌రాజా ఆరోపించారు. పల్లెబాట కార్యక్రమంలో భాగంగా గురువారం మేడూరు, ఐనపూరు గ్రామాల్లో ఆయన పర్యటించారు. ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. రోడ్లు, డ్రెయిన్లు త్రాగునీరు వంటి కనీస వసతులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. స్థానిక ఎమ్మెల్యే దోచుకోవడంపై పెట్టిన శ్రద్ధ అభివృద్ధిపై పెట్టలేదన్నారు. రోడ్లు వేయక పోగా ఇసుక మాఫియాతో ఉన్న వాటిని నాశనం చేశారన్నారు. పల్లెలు పచ్చగా ఉండాలంటే గ్రామాల్లో పసుపు జెండా ఎగరాలన్నారు. రాజుపాటి శ్రీనివాసరావు, కొల్లూరి బాబ్జి, సురేశ్, కొండల రావు, సుంకర స్వామి, దూడల శ్రీనివాసరావు, మేడిశెట్టి నాగరాజు పాల్గొన్నారు.

పత్రికా స్వేచ్ఛను కాపాడండి



చల్లపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి, వినతిపత్రం అందిస్తున్న అఖిలపక్ష నేతలు

చల్లపల్లి, ఫిబ్రవరి 22: రాప్తాడు సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి ఫొటో జర్నలిస్ట్ శ్రీకృష్ణపై, కర్నూలులో ఓ దినపత్రిక కార్యాలయంపై దాడులు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, పత్రికా స్వేచ్ఛను కాపాడాలని అఖిలపక్ష నేతలు డిమాండ్ చేశారు. గురువారం చల్లపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట పలువురు నేతలు నిరసన తెలిపారు. రాష్ట్రంలో జర్నలిస్టులపై దాడులు రోజురోజుకీ పెరిగిపోతున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఢిల్లీలో వారం నుంచి రైతాంగ పోరాటాలపై ప్రధాని జరుపుతున్న దారుణ మారణ కాండను ఖండిస్తున్నామని తెలిపారు. పంజాబ్ యువరైతు శుభకరణ్ సింగ్‌ను హరియాణ పోలీసులు కాల్పులలో పొట్టన పెట్టుకోవటాన్ని నేతలు తీవ్రంగా ఖండించారు. రైతు సమస్యలను కేంద్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్‌బాబు, సీపీఎం మండల కార్యదర్శులు యద్దనపూడి మధు, వాకా రామచంద్రరావు, కాంగ్రెస్ అధ్యక్షుడు మీర్ రిజ్వాన్, ఎంఎల్ పార్టీ నేత పరుచూరి జనార్దన్, సీఐటీయూ కార్యదర్శి మహమ్మద్ కరీముల్లా, ప్రజాసంఘాల నేతలు దాసి సీతారామరాజు, చోడాబత్తిన ఆదినారాయణ, జగ్గారపు బాబూరావు, అన్వర్ బాషు పాల్గొన్నారు.



49వ డివిజన్‌లో పైప్‌లైన్ల నుంచి వృథాగా పోతున్న తాగునీటిని మీడియాకు చూపుతున్న బండి రామకృష్ణ, గడ్డం రాజు

తాగునీరు వృథా అవుతున్నా పట్టించుకోరా..

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 22: వేసవి వచ్చేస్తోందని, నగరంలో తాగునీటి పైపులైన్ల లీకులకు మరమ్మతులు చేయకుండా పాలకులు, అధికారులు కాలయాపన చేస్తున్నారని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ అన్నారు. 49వడివిజన్ బలరామునిపేటలో గురువారం పార్టీ నగర అధ్యక్షుడు గడ్డం రాజుతో కలిసి ఆయన పర్యటించారు. స్థానికులు పలు సమస్యలను జనసేన నాయకుల దృష్టికి తెచ్చారు. బలరామునిపేటలో పైప్‌లైన్ లీకులను జనసేన నాయకులు మీడియాకు చూపించారు. నగరంలో పలుచోట్ల పైపులు లీకవడం వల్ల తాగునీరు కలుషితమవుతోందన్నారు. తాగునీటికి నగర ప్రజలు ఇబ్బంది పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

పేదలకు రూ.15కే భోజనం

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 22: పేదలకు రూ.15కే భోజనం పంపిణీ చేయడం ఎంతో ముదావహమని ఏపీఎస్ఆర్టీసీ జోనల్ చైర్మన్ పిన్నింటి మహేష్ అన్నారు. గురువారం సహాయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా క్యాంటీన్‌లో ఆయన అన్నదానం చేశారు. సంస్థ అధ్యక్షుడు ఎండీ ఇలియాస్ పాషా, కాగిత సాంబశివరావు, మాజేటి లక్ష్మీకాంతం, విన్నకోట సంధ్య, ఖాజా పాల్గొన్నారు.

ఘనంగా బాలోత్సవం



సాంస్కృతిక ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులు

నాగాయలంక, ఫిబ్రవరి 22: జడ్పీ హైస్కూల్‌లో గురువారం విద్యాశాఖ ఆధ్వర్యంలో బాలోత్సవం నిర్వహించారు. ఇటీవల మండల స్థాయిలో ఆటల, విద్యా, సాంస్కృతిక పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు బహుమతులు అందించారు. ఎంఈవో టి.వి.ఎం.రామదాసు పాల్గొన్నారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

సచివాలయ ముట్టడికి వెళ్లకుండా..

కాంగ్రెస్ నేతల ముందస్తు అరెస్టులు



అవనిగడ్డలో ఆది రామ్మోహనరావుకు నోటీసిస్తున్న పోలీసు



గుడివాడలో బలరామ్‌ను హౌస్ అరెస్టు చేస్తున్న కానిస్టేబుల్

అవనిగడ్డ, ఫిబ్రవరి 22: దగా డీఎస్సీ వద్దు - మెగా డీఎస్సీ కావాలంటూ చలో సచివాలయం పేరుతో గురువారం కాంగ్రెస్ తలపెట్టిన ముట్టడి కార్యక్రమానికి వెళ్లకుండా కాంగ్రెస్ నేతలకు పోలీసులు నోటీసులు జారీ చేశారు. అవనిగడ్డలో కాంగ్రెస్ సీనియర్ నేత ఆది రామ్మోహనరావు, మరికొందమందికి పోలీసులు నోటీసులు ఇచ్చారు. కార్యక్రమానికి వెళితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గుడివాడ: సచివాలయం ముట్టడికి వెళుతున్న కాంగ్రెస్ నాయకుడు గోకరకొండ బలరాంను గురువారం తెల్లవారుజామున పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. రాష్ట్రంలో నియంతృత్వ ప్రభుత్వం అధికారంలో ఉందని, ప్రశ్నించే హక్కును కాలరాస్తోందని బలరాం ఆగ్రహం వ్యక్తంచేశారు.

చల్లపల్లి: కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మీర్ రిజ్వాన్‌ను పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. ఎస్ఐ సీహెచ్ చిన్నబాబు నోటీసులు అందించారు.

పెడనలో స్టేషన్‌కు తరలింపు

పెడన: సచివాలయ ముట్టడి ఆందోళనలో పాల్గొనేందుకు బయలుదేరిన కాంగ్రెస్ పట్టణ నాయకులు సీహెచ్‌వీ అప్పారావు, ఆకురాతి జనార్దన్, జన్యావుల లీలాకృష్ణ, రాగి రమేష్‌లను పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. అనంతరం వారిని వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు.



తెలుగు మహిళలతో వెనిగండ్ల రాము, రావి వెంకటేశ్వరరావు

4న మహిళా గళం విజయవంతం చేద్దాం

● పార్టీ శ్రేణులకు వెనిగండ్ల రాము, రావి వెంకటేశ్వరరావు పిలుపు

గుడివాడ: తెలుగు మహిళ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలో మార్చి 4న నిర్వహించే మహిళా గళం కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని పార్టీ శ్రేణులకు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెనిగండ్ల రాము, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఏలూరురోడ్డులోని నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు తలశిల స్వర్ణలత, సభ్యులు గురువారం వారిని కలిశారు. టీడీపీ మేనిఫెస్టోలో మహిళా శక్తి పేరిట మహిళలకు పెద్దపీట వేసిందని వెనిగండ్ల, రావి తెలిపారు. జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక రాష్ట్రవ్యాప్తంగా రోజూ మహిళలపై దాడులు జరుగుతూనే ఉన్నాయని, సిద్ధం సభలకు డ్వాక్రా మహిళలను బెదిరించి తీసుకువెళుతున్నారని, అమ్మ ఒడి పథకం ద్వారా డబ్బులు ఇచ్చినట్టే, ఇచ్చి నిత్యావసర వస్తువుల ధరలు పెంచి లాక్కుంటున్నారని తలశిల స్వర్ణలత ఆరోపించారు. తెలుగు మహిళా నాయకులు మైనేని ఇందిర, పాలపర్తి పద్మజ, తూము పద్మజ, అనిలేటి నిర్మల, వేమూరి సుజాత, కొల్లి రమ్య, మాదాల సునీత, కాటూరి గంగాభవాని, చిగురుపాటి దివ్యచౌదరి, బొబ్బా లక్ష్మి, నాగదేశి రమాదేవి పాల్గొన్నారు.

200 మందికి ఆహార పొట్లాల పంపిణీ



యానాదుల కాలనీలో పేదలకు ఆహార పొట్లాలు అందిస్తున్న యూనియన్ బ్యాంకు రీజనల్ హెడ్ కె. వెంకట్రావు

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 22: యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా రూ.3వేల కోట్ల క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూటషనల్ ప్లేస్‌మెంట్ విజయవంతంగా ముగిసినందుకు కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా గురువారం పోర్టురోడులోని యానాదుల కాలనీలో 200 మంది పేదలకు ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. ఈడేపల్లి వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేశారు. యూనియన్ బ్యాంకు రీజనల్ హెడ్ కె. వెంకట్రావు, రిటైర్డు ఉద్యోగుల సంఘ నాయకుడు మహమ్మద్ మునీర్, కె. సాయిమోహన్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

● ముగ్గురు యువకులకు గాయాలు

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 22: బందరు మండలం సుల్తానగరం సుమ కన్వెన్షన్ హాలు వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి చెందాడు. ముగ్గురు యువకులకు గాయాలయ్యాయి. రూరల్ ఎస్ఐ పద్మ అందించిన వివరాలిలా ప్రకారం..మచిలీపట్నం నుంచి తన స్వస్థలమైన కూచిపూడికి కనుమూరి చింతయ్య (60) టీవీఎస్ ఎక్స్‌ఎల్‌పై రాంగ్ రూట్‌లో వెళుతున్నాడు. ఎదురుగా ద్విచక్ర వాహనంపై ట్రిబుల్ రైడింగ్ చేస్తూ గన్నవరం, గుణదల ప్రాంతాలకు చెందిన ముగ్గురు యువకులు మంగినపూడి బీచ్‌కు వస్తున్నారు. వారి బైక్ చింతయ్య ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. దీంతో చింతయ్య అక్కడికక్కడే మృతిచెందారు. చింతయ్య మృతదేహాన్ని మచిలీపట్నం ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం పంపారు. చింతయ్య మద్యం తాగి ఉన్నట్టు పోలీసులు తెలిపారు. ట్రిబుల్ రైడింగ్ చేస్తున్న ముగ్గురు యువకులు గాయపడ్డారు. వారి ముగ్గురిని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి పంపారు. చింతయ్య కుమార్తె పైడమ్మ ఇచ్చిన ఫిర్యాదుపై ఎస్ఐ పద్మ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రూ.50 వేల కోట్ల ఇసుక కొల్లగొట్టారు

● సీఎం జగన్‌పై గొర్రెపాటి గోపీచంద్ ఆరోపణ

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 22: ఇసుక దోపిడీని సీఎం జగన్ ప్రత్యేక పాలసీగా అమలు చేస్తూ రూ. 50 వేల కోట్లు కొల్లగొట్టారని టీడీపీ సీనియర్ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్ ఆరోపించారు. బుధవారం తన కార్యాలయం వద్ద విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ వద్దకు చేరిన నివేదికలో సీఎం జగన్‌రెడ్డి సాగిస్తున్న ఇసుక దోపిడీపై వాస్తవాలు తేటతెల్లమయ్యాయన్నారు. ఇసుక రీచ్‌ల్లో తవ్వకాలు, రవాణాను గూగుల్ టేక్ అవుట్ చిత్రాల ద్వారా కేంద్ర పర్యావరణ, అటవీశాఖ, కేంద్ర పొల్యూషన్ బోర్డు నివేదికల్లో బయటపెట్టిందన్నారు. జేపీ వెంచర్స్‌కు ప్రభుత్వం రూ. 12 కోట్లు చెల్లించిందని, ఆ సంస్థ నుంచి రూ. 1520 కోట్లు వచ్చాయనడం అబద్ధమన్నారు. ఏపీఎండీసీ డీజీఎం వెంకటరెడ్డి మైనింగ్, జుయాలజీ ఇన్‌చార్జి డైరెక్టర్ పదవిలో కొనసాగేందుకు అనర్హుడన్నారు.

క్రికెట్ కిట్లు అందజేత

కోడూరు, ఫిబ్రవరి 22: గుడ్ మార్నింగ్ అవనిగడ్డ కార్యక్రమంలో భాగంగా పాలకాయితిప్ప గ్రామంలో జనసేన పార్టీ నాయకుడు చిలకలపూడి పాపారావు పర్యటించారు. గ్రామంలోని క్రీడాకారులకు క్రికెట్ కిట్లను అంద జేశారు. మర్రే గంగయ్య, కోట రాంబాబు, కొక్కిలిగడ్డ సముద్రాలు పాల్గొన్నారు.

ఓటును సద్వినియోగం చేసుకోండి

నాగాయలంక, ఫిబ్రవరి 22: ఓటర్లందరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని వెలుగు ఏపీఎం కె.వై.దాస్ సూచించారు. గురువారం గుల్లలమోదలో స్వయం సహాయ సంఘ సభ్యులకు ఓటు హక్కు వినియోగంపై ఆయన అవగాహన కల్పించారు. వీవోఏలు, సీసీలు, వీవో ప్రెసిడెంట్లు, సహాయక సభ్యులు పాల్గొన్నారు.

ప్రాణాంతక వ్యాధులపై అప్రమత్తత అవసరం

నాగాయలంక, ఫిబ్రవరి 22: ప్రాణాంతక వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం కళాకారుడు ఎం.శేఖర్‌బాబు సూచించారు. జాతీయ ఎయిడ్స్ నియంత్రణ మండలి, రాష్ట్ర, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి సంయుక్త ఆధ్వర్యంలో గురువారం నాగాయలంక కూడలిలో ఎం.శేఖర్‌బాబు, కళాకారులు ఎయిడ్స్, టీబీ వ్యాధులపై వీధి నాటికలు ప్రదర్శించారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ జి.శివయ్య, మద్దాల కోటేశ్వరమ్మ, ఆశాకార్యకర్తలు పర్యవేక్షించారు.

రేపు, ఎల్లుండి పోతురాజుస్వామి జాతర

నాగాయలంక, ఫిబ్రవరి 22: నాగాయలంకలో పోతురాజు స్వామి జాతర మహోత్సవాలు ఈనెల 24, 25 తేదీల్లో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు భక్త బృందం తెలిపింది. 24న స్వామి ఘటాలను కృష్ణానదిలో ఊరేగింపు, 25న జాతర, చద్ది నైవేద్యాలు, మొక్కుబడులు సమర్పణ, రాత్రికి పల్నాటి ఆచారాలతో జాతర జరుగుతుందని పేర్కొంది.

వలంటీర్లకు పురస్కారాలు

పెడన, ఫిబ్రవరి 22: వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో గురువారం వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. పెడన, గూడూరు, బంటు మిల్లి, కృత్తివెన్ను మండలాల వలంటీర్లకు సేవామిత్ర, సేవారత్న, సేవా వజ్ర పురస్కారాలను జడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక అందించారు. వైసీపీ పెడన సమన్వయకర్త ఉప్పాల రాము పాల్గొన్నారు.

రైతు ఉద్యమంపై ఉక్కుపాదం తగదు

● సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రవి



పామర్రులో నిరసన ప్రదర్శన చేస్తున్న సీఐటీయూ నేతలు

పామర్రు, ఫిబ్రవరి 22: పంటలకు గిట్టుబాటు ధరల కోసం ఢిల్లీలో రైతులు చేస్తున్న ఆందోళనపై చేసిన కేంద్ర ప్రభుత్వం రాక్షస చర్యలకు పాల్పడడం తగదని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ రవి అన్నారు. ఢిల్లీలో రైతుల పట్ల కేంద్ర ప్రభుత్వం వ్యవహరించిన తీరుకు నిరసనగా రైతులకు మద్దతుగా సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం రాత్రి నిరసన ప్రదర్శన నిర్వహించారు. శాంతి యుతంగా ఆందోళన చేస్తున్న రైతులపై మోదీ ప్రభుత్వం హింసాత్మక చర్యలకు పాల్పడడం సరికాదన్నారు. సీఐటీయూ జిల్లా నాయకులు ఒ.గంగాధర్, ముళ్లపూడి విల్సన్, రాజు పాల్గొన్నారు.

రైతుల పోరాటానికి సీపీఎం మద్దతు

గుడివాడ: ఢిల్లీలో రైతులు చేస్తున్న పోరాటానికి సీపీఎం గుడివాడ శాఖ పూర్తి మద్దతు తెలుపుతోందని పార్టీ పట్టణ కార్యదర్శి ఆర్సీపీ రెడ్డి పేర్కొన్నారు. గురువారం కామ్రేడ్ సుందరయ్యభవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీ హామీలను అమలు చేయాలని హరియాణ రైతులు ఆందోళన చేపట్టారన్నారు.

ముస్లిం చైతన్య వేదిక మద్దతు

మచిలీపట్నం టౌన్: హరియాణ రైతులు జరుపుతున్న ఉద్యమానికి మద్దతు తెలుపుతున్నట్టు ముస్లిం చైతన్యవేదిక మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షుడు హసీంబేగ్ తెలిపారు. సంఘ కార్యాలయం వద్ద హసీంబేగ్, ముస్లిం చైతన్య వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ మౌలాలి, జిల్లా అధ్యక్షుడు ఎస్కె అమీర్, లీగల్ సెల్ సలహాదారుడు మహమ్మద్ మస్తాన్, మౌలానా జైలుస్ ఖాద్రి మాట్లాడారు.

వైసీపీ ప్రభుత్వం మాటలకే పరిమితం: ఆవుల బసవయ్య

కోడూరు, ఫిబ్రవరి 22: వైసీపీ ప్రభుత్వం మాటల ప్రభుత్వమే కానీ చేతల ప్రభుత్వం కాదని రైతు సంఘం మండల నాయకుడు ఆవుల బసవయ్య అన్నారు. గురువారం విలేకరులతో ఆయన మాట్లాడారు. మండలవ్యాప్తంగా ఆర్బీకేల ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యానికి 21 రోజులు లోపు నగదు చెల్లించాలని, కానీ 40 రోజులు అవుతున్నా ఇంతవరకు నగదు రైతులకు చెల్లించలేదని ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతులకు ఇంత వరకు నష్టపరిహారం అందించలేదన్నారు. రైతులకు ధాన్యం నగదు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు.